
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
ఆదివారం, 8 డిసెంబరు 2024
3



నేడు నగరంలో పెన్షనర్ల సదస్సు

ఖమ్మంటౌన్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో పెన్షనర్ల సదస్సు ఆదివారం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు పరిశ పుల్లయ్య తెలిపారు. పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి, వాటి పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకునేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సులో రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు. శనివారం నగరంలోని జడ్పీ విశ్రాంతి మందిరంలో సన్నాహక సమావేశం జరిగింది. సంఘం జిల్లా కార్యదర్శి కె.వేంకటేశ్వర్లు, పి.సత్యనారాయణ, రవికుమార్ పాల్గొన్నారు.

బావమరిదిపై బావ కాల్పులు

- తన అక్కను వేధిస్తుండటంతో పద్ధతి మార్చుకోవాలని బావమరిది హితవు
- తీరుమారకపోవడంతో ఇంటికి తీసుకెళ్లిన తమ్ముడు
- కక్ష పెంచుకొని ఎయిర్‌గన్‌తో కాల్పులు జరిపిన బావ
- కాలుకు గాయం.. తృటిలో తప్పిన ప్రాణాపాయం
- పాత పాల్వంచలో అమానుష ఘటన



గాయపడిన సిరాజ్

4

రూ.15 లక్షలు కొట్టేశారు...

- విశ్రాంత ఉద్యోగిని నిండా ముంచిన సైబర్ నేరగాళ్లు
- హవాలా కేసులో అరెస్టు చేస్తామని హెచ్చరిక
- సుప్రీంకోర్టు ఆడిట్ విభాగానికి డబ్బు పంపాలని హుకుం
- భయపడి రూ.15 లక్షలు జమ చేసిన బాధితుడు
- భూమిని అమ్మగా వచ్చిన డబ్బులు అర్పణం
- బంధువుల సహకారంతో పోలీసులకు ఫిర్యాదు



బాధితుడు నర్సింహారావు

4

ఇద్దరు ఇంటర్ విద్యార్థినుల ఆత్మహత్య

- తల్లిదండ్రులు మందలించినందుకు ఉరేసుకున్న ఇద్దరు
- అశ్వారావుపేట, కొత్తగూడెంలో వేర్వేరు ఘటనలు
- క్షణికావేశమే కారణం.. కన్నీరుమున్నీరైన కుటుంబాలు



జేశ్వరి సాయి



కె. మేఘన

4

ముఖాముఖి



20లోగా 'ఇందిరమ్మ' ఇళ్ల సర్వే పూర్తి

బి.శ్రీనివాసరావు,
గృహనిర్మాణ శాఖ ఈఈ, ఖమ్మం

ప్రశ్న: ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియ మొదలైందా?

జవాబు: ఇందిరమ్మ ఇళ్లపై యాప్ ద్వారా శనివారం నుంచి సర్వే మొదలు పెట్టాం. ప్రజాపాలన కార్యక్రమంలో ఇళ్లు లేని వారు, సొంత స్థలం ఉండి ఇళ్లు కట్టుకోవాలనుకున్న వారినుంచి 4లక్షల వరకు దరఖాస్తులు వచ్చాయి. అందులో 3,57,869 దరఖాస్తులు సక్రమంగా ఉన్నట్లు గుర్తించి వీరి ఇళ్లకు వెళ్లి సర్వే చేపడుతున్నాం.

ప్ర: సర్వే ఎలా చేస్తున్నారు. ఎవరు చేస్తున్నారు..?

జ: జిల్లాలో 589 గ్రామ పంచాయతీ కార్యదర్శులు, 125 మునిసిపల్ వార్డు అధికారులతోపాటు గ్రామ, మండలస్థాయి పలు శాఖల సిబ్బందిని కూడా భాగస్వామ్యం చేసి సర్వే చేపడుతున్నాం. మొబైల్ ఫోన్ యాప్‌లోనే ఇందిరమ్మ ఇళ్ల సర్వే జరుగుతోంది. ఈనెల 20లోగా మొత్తం సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించాం. రోజుకు ఒక్కొక్కరు 30నుంచి40 మందిని సర్వే చేయాల్సి ఉంటుంది.

ప్ర: సర్వేలో తీసుకునే అంశాలు ఏమిటి..?

జ: 35కు పైగా అంశాలు ఉన్నాయి. కుటుంబ వివరాలు, స్థలం వద్ద ఫొటో, స్థలం లేకుంటే లేదని తెలుసుకోవడం, రేషన్ ఆధార్ కార్డు వివరాలు, స్థానికత, గుర్తింపు తదితర విషయాలను సర్వే చేయడం జరుగుతుంది. పూరి గుడిసెలు, రేకుల ఇళ్లు, అసలు ఇళ్లు లేని పేదలు, సొంత స్థలంఉండి ఇళ్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ప్రాధాన్యం ఉంటుంది.

ప్ర: సర్వే జాబితాలో పారదర్శకత లోపిస్తే అర్హులకు అన్యాయం జరగదా..?

జ: సర్వేల కేటగిరీ వారీగా ప్రాధాన్య జాబితాను గుర్తించిన తరువాత, గ్రామపంచాయతీ, మునిసిపాలిటీల వారీగా గ్రామ సభలు పెట్టి, అతిపేద వారిని, ఇళ్లు లేని వారిని ప్రాధాన్య క్రమంలో గుర్తించి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తాం.

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

జల సంకల్పం



'సీతారామ'కు జయహో!

గడిచిన ఐదేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయి ఉన్న సీతారామ సాగునీటి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. మొదటి విడతగా గోదావరి జలాలను సాగర్‌కు అనుసంధానం చేసే సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టును రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్టు 15న ప్రారంభించి గోదావరి జలాలను విడుదల చేసిన విషయం విదితమే. రెండేళ్లలో ఈ ప్రాజెక్టు మొత్తం పనులను పూర్తిచేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి వైరా సభలో హామీ ఇచ్చారు. హామీ ఇచ్చినట్టుగానే అసంపూర్తిగా ఉన్న ప్రధాన కాలువతోపాటు పాలేరు లింక్‌కెనాల్, సత్తుపల్లి యాతాలకుంట ట్రంక్ పనులు పూర్తిచేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధంచేసి పనులు వేగవంతం చేస్తుంది. డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పనులకు కూడా టెండర్లు ప్రారంభించింది.

ప్రాజెక్టు నిర్మాణ అంచనా వ్యయాన్ని పెంచిన సర్కారు

- రూ.13,500 కోట్ల నుంచి రూ.19,465 కోట్లకు పెంపు
- మిగిలిన పనులకు టెండర్ల ప్రక్రియ వేగవంతం
- డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ పూర్తయితే అందనున్న గోదావరి జలాలు
- 6.74 లక్షల ఎకరాల సాగర్ ఆయకట్టు స్థిరీకరణ

ఖమ్మం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రతిష్ఠాత్మక సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణ వ్యయాన్ని రూ.19,465 కోట్లకు పెంచుతూ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 6.74లక్షల ఎకరాలతోపాటు సాగర్ ఆయకట్టును స్థిరీకరించేందుకు సీతారామ సాగునీటి ప్రాజెక్టు రూపకల్పన చేసిన విషయం విదితమే. గతంలో దుమ్ముగూడెం, రుద్రంకోట ఎత్తిపోతల ప్రాజెక్టులుగా రాజీవ్, ఇందిరాసాగర్‌లుగా ప్రతిపాదించారు. రాష్ట్ర విభజన అనంతరం రుద్రంకోట ప్రాజెక్టు ప్రాంతం ఆంధ్రాలోకి వెళ్లడంతో 2016లో రూ.7920 కోట్ల అంచనాలతో సీతారామ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. 112కి.మీ. ప్రధాన కాలువలతోపాటు మూడు పంపుహౌజ్‌లతో చేసిన ప్రతిపాదనలు 2018నాటికి రూ.13,500కోట్లకు పెంచారు. మహబూబాబాద్ జిల్లాతోపాటు పాలేరు రిజర్వాయర్‌కు అనుసంధానం చేసేలా రూపకల్పన చేశారు. 10లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో అశ్వాపురం మండలం బీజీకొత్తూరులో ఒక పంపుహౌజ్ ములకలపల్లి మండలం పూసుగూడెంలో మరో పంపుహౌజ్, కమలాపురంలో మరో పంపుహౌజ్ ఏర్పాటుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిధుల సమస్య కారణంగా కొంతకాలం పనులు అసంపూర్తిగా ఉన్నాయి. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో రూపకల్పన జరిగిన సీతారామ ప్రాజెక్టు పనులు.. ఆయన మళ్లీ వ్యవసాయశాఖ మంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వంలో బాధ్యతలు తీసుకున్న తర్వాత పనులను వేగిరం చేయించారు. జూలూరుపాడు మండలం వినోబానగర్ నుంచి సీతారామ ప్రధాన కాలువనుంచి 9.కి.మీ. లింక్‌కెనాల్‌కు రూ.90కోట్లు నిధులు మంజూరు చేయించారు. సాగర్ ఎడమకాలువకు అనుసంధానం చేయడంతో వైరా ప్రాజెక్టుకు నీరు చేరేలా రూపకల్పన చేసి గత ఆగస్టు15న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సీతారామ ఎత్తిపోతలను ప్రారంభింపచేశారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండేళ్లలో ఈ ప్రాజెక్టు పూర్తిచేస్తామని హామీ ఇవ్వడంతో మళ్లీ నిధుల కేటాయింపులు మొదలయ్యాయి. ఇందులో భాగంగా డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌కు సంబంధించి ప్యాకేజీ 1లో రూ.350కోట్లు, ప్యాకేజీ 2లో రూ.172కోట్లు, ప్యాకేజీ 3లో రూ.350కోట్లు, ప్యాకేజీ 13లో రూ.190కోట్లు, ప్యాకేజీ 6లో రూ.315కోట్లకు నీటిపారుదల శాఖ టెండర్లు పిలిచింది. నేడో, రేపో టెండర్లు పిలిచి పనులు వేగవంతంగా చేపట్టబోతున్నారు.

ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలి

- ఖమ్మం నగరాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం
- జనాభాకనుగుణంగా నూతన మాస్టర్‌ప్లాన్ రూపకల్పన
- వెలుగుమట్ల అర్బన్ అటవీపార్కును అభివృద్ధి చేస్తాం..
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఖమ్మంలో మామిళ్లగూడెం-సారథినగర్ రైల్వే మినీ అండర్‌బ్రిడ్జికి ప్రారంభోత్సవం



ఖమ్మంలో రైల్వే మినీ అండర్‌బ్రిడ్జిని ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం నగరానికి ఆనుకుని ఉన్న వెలుగుమట్ల అర్బన్ అటవీపార్కును అందరూ సందర్శించేలా అభివృద్ధి చేస్తామని, ఏడాదిలోగా ఈ పార్కు అభివృద్ధి పనులన్నీ పూర్తవుతాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్రానికి ఖమ్మం ఆదర్శ నగరంగా నిలవాలని, సకల జనులు సంతోషంగా ఉండే విధంగా నగర అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ఖమ్మంలో రూ.కోటి 90 లక్షలతో సారథినగర్-మామిళ్లగూడెం మధ్య (మిగతా 6వ పేజీలో)

జూలూరుపాడు ఎస్ఐపై వేటు

తప్పుడు కేసు నమోదు చేసినందుకు చర్య

జూలూరుపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు ఎస్ఐ బాణోత్ రాణాప్రతాప్‌ను పోలీస్ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు పోలీస్‌స్టేషన్‌లో రాణాప్రతాప్ ఎస్ఐగా పనిచేస్తున్న సమయంలో... ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడిన సంఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. అయితే డ్రైవర్‌కు లైసెన్స్ లేకపోవడంతో ట్రాక్టర్ యజమాని వాహనాన్ని నడుపుతుండగా అదుపుతప్పి బోల్తా పడటంతో ఓ వ్యక్తి చనిపోయినట్లు గతేడాది ఆగస్టు 4న కేసు నమోదు చేశారు. అప్పట్లో సదరు ఎస్ఐ తప్పుడు కేసు నమోదు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో పోలీస్ ఉన్నతాధికారులు ఈ కేసుపై విచారణ నిర్వహించారు. వారి విచారణలో ఎస్సై తప్పుడు కేసును నమోదు చేసినట్లు నిర్ధారణ అయినట్టు తెలిసింది. దీంతో ఆయనపై సస్పెన్షన్ వేటు వేస్తూ శుక్రవారంరాత్రి ఉత్తర్వులు జారీచేశారు. కాగా రాణాప్రతాప్ జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో ఈ ఏడాది సెప్టెంబరు నెల నుంచి విధులు నిర్వహిస్తున్నారు.

ఏడాది పాలనలో అభివృద్ధి శూన్యం

- ఇచ్చిన వాగ్దానాలను పూర్తిగా అమలుచేయని కాంగ్రెస్ ప్రభుత్వం
- రాబోయే కాలంలో వామపక్షాలను ఐక్యం చేస్తాం
- మతకలహాలు, ఘర్షణలను ప్రోత్సహిస్తున్న బీజేపీ
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- మల్లారంలో మధిర డివిజన్ మహాసభ



డివిజన్ మహాసభలో మాట్లాడుతున్న తమ్మినేని

మధిర రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం పూర్తయిందని, ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి శూన్యమని, మాటలు తప్ప చేతల్లో ఏమీ కన్పించటం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాల్సిందేనని లేకపోతే సహించే ప్రసక్తే లేదని తమ్మినేని హెచ్చరించారు. ఖమ్మం జిల్లా మధిర మండలం మల్లారంలో శనివారం సీపీఎం డివిజన్ మహాసభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఏ వాగ్దానం సక్రమంగా అమలుకావడం లేదన్నారు. ప్రస్తుతానికి మహిళలకు ఉచిత బస్సు తప్ప మిగతా చెప్పిన ఏ పథకాలను కూడా అమలుచేయలేకపోయిందన్నారు. రుణమాఫీ అసంపూర్తిగా ఇచ్చారని, రైతులకు రైతుభరోసా లేదని, పింఛన్ల పెంపు, ఇళ్లు, మహిళా శక్తి వంటి పథకాలను చెప్పి అమలు చేయలేకపోవడం దారుణమన్నారు. లగచర్ల ఘటనలో సీపీఎం ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతుల పక్షాన నిలబడి పోరాటం చేసి విజయం సాధించిందన్నారు. హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో పేద, మధ్యతరగతి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే ఒప్పుకోమన్నారు. మూసీ ప్రాజెక్టు పేరుతో 15వేల ఇళ్లు కూలగొట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. రాబోయే కాలంలో వామపక్షాలను ఐక్యం చేస్తామని, ఎర్రజెండాకు కంచుకోటలైన అన్ని ప్రాంతాల్లోనూ బలమైన పట్టు సాధిస్తామన్నారు. రాజ్యాంగ సంస్థలను బీజేపీ (మిగతా 4వ పేజీలో)

గ్రూప్-2 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లాలో 85 పరీక్ష కేంద్రాలు
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15,16 తేదీల్లో జరగబోయే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయనున్నట్టు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. పరీక్షల నిర్వహణకు జిల్లాలో 85 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు ఉదయం 8.30 గంటలకు, మధ్యాహ్నం 1.30 గంటలకు రెండు సెషన్లుగా ఉంటాయన్నారు.అభ్యర్థులు పరీక్షల హాల్ టికెట్లు ఈ నెల 9వ తేదీనుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఉదయం సెషన్ పరీక్షకు పరీక్షా కేంద్రం గేట్‌ను ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం సెషన్‌కు మధ్యాహ్నం 2.30 గంటలకు మూసివేస్తారని, గేటు మూసిన తర్వాత అభ్యర్థులను లోనికి అనుమతించరని కలెక్టర్ పేర్కొన్నారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కోరారు. పరీక్షా కేంద్రాలను అభ్యర్థులు ఒకరోజు ముందు వెళ్లి లోకేషన్ చూసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు క్యాలిక్యులేటర్, సెల్‌ఫోన్, పెన్‌డ్రైవ్, బ్లూటూత్, డివైజెస్, జువెలరీ, ఎలక్ట్రానిక్ గాడ్జెట్ తదితర సామగ్రిని తీసుకుని రావడానికి వీల్లేదని, చెప్పులు మాత్రమే వేసుకుని రావాలని, షూస్ వేసుకోవద్దన్నారు.

కొర్రీలు మొదలాయే..


- ధాన్యం దిగుమతులకు మిల్లర్ల పేచీలు
- గరికపాడు, పూసలపాడు సొసైటీల్లో తిరకాసు
- ఎంటీయూ 1262 రకాన్ని తీసుకోనేందుకు నిరాకరిస్తున్న వైనం
- అధికారులు స్పందించడంతో రైతులకు తాత్కాలిక ఉపశమనం

5

వసతి సౌకర్యాలతో డిప్లొమా కాలేజీ

- భవన నిర్మాణం పూర్తి కాగానే కృష్ణసాగర్‌లో తరగతులు
- అప్పటి వరకు మణుగూరులో కొనసాగింపు
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కృషితో మంజూరు
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

5



గ్రామీణ నిరుపేద కుటుంబం నుంచి జాతీయస్థాయి ఉత్తమ నటుడి దాకా ఎదిగాడు ఈ కళాకారుడు. పేదరికాన్ని వరంగా మార్చుకొని కళాకారుడిగా రాణిస్తున్నాడు. చిన్నప్పటి నుంచే నాటక రంగంలో మక్కువ పెంచుకొని తన కళానైపుణ్యాన్ని చాటుతూ పలువురి మన్ననలను అందుకుంటున్నాడు. ఓ పక్క వ్యవసాయ పనులు చేస్తూనే కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటూ కళారంగంలో విశేషంగా రాణిస్తున్నాడు. అతడే మధిర మండలం మాటూరుపేట గ్రామానికి చెందిన చిలివేరు శాంతయ్య.

నటనలో.. తగ్గేదేలే..

- కళాకారుడిగా రాణిస్తున్న శాంతయ్య
- జాతీయస్థాయి నటుడిగా ప్రశంసలు
- పౌరాణిక, జానపదాలకు జీవం పోస్తున్న వైనం

మధిర రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పద్యాలు నేర్చుకొని వాటిని తన సొంత గొంతుతో పాడుతూ ఏపాత్రనైనా ప్రేక్షకుల ముందు ఉంచటం శాంతయ్యకు వెన్నతో పెట్టిన పెట్టిన విద్య. రాముడు, కృష్ణుడు, సాంఘికాల్లో సుబ్బిశెట్టి, హరిశ్చంద్రుడిలో నక్షత్రుడిగా ఇలా ఏ పాత్రనైనా అవలీలగా పోషించటం శాంతయ్య ప్రత్యేకత. మోహిని భస్మాసుర నాటకంలో శివుడిగా, బాలనాగమ్మలో బాలవర్ధిరాజుగా, భక్తకన్నప్పలో నారదుడిగా తెలుగు రాష్ట్రాల్లో నాటికలు ప్రదర్శించాడు.

గుర్తింపు తెచ్చిన పాత్రలు..

పాదుకా పట్టాభిషేకంలో లక్ష్మణుడిగా, శ్రీకాళహస్తిలో ఆయన నటనకు బహుమతులు లభించాయి. బొబ్బిలిదాడా, సోదర ప్రేమ, పుటుక్కుజరజర, మధ్యతరగతి మందహాసం వంటి నాటికల ద్వారా శాంతయ్య బహుళ ప్రచారం పొందాడు. పేదకుటుంబంలో పుట్టిన శాంతయ్య కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తూ మిగిలిన సమయాల్లో నాటక ప్రదర్శనలకు కేటాయిస్తుంటాడు. కళాసేవకు పేదరికం అడ్డురాదని చెపుతున్నాడు. పోటీల్లో పాల్గొని తన గానమాధుర్యంతో గ్రామానికి, జిల్లాకు, రాష్ట్రానికి పేరుప్రఖ్యాతలు తెచ్చిపెట్టాడు.



లభించిన అవార్డులు..

2010లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నంద్యాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి నాటక పోటీల్లో లక్ష్మణుడి పాత్రకు ఉత్తమ నటుడి అవార్డు అందుకున్నాడు. తిరుపతిలో శ్రీవేంకటేశ్వరస్వామి కళానాట్యమండలి పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జాతీయ స్థాయి నాటక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చి జాతీయస్థాయి ఉత్తమ నటుడిగా అవార్డు పొందాడు. శ్రీకాళహస్తిలో పాదుకాపట్టాభిషేకం నాటక ప్రదర్శనలో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి లభించింది. 2014లో నిజామాబాద్‌లో జరిగిన పోటీల్లో పాదుకాపట్టాభిషేకం నాటకంలో రాముని పాత్రకు ఉత్తమ సహాయ నటుడి అవార్డు లభించింది.



నంది నాటకోత్సవాల్లో ఉత్తమ నటుడిగా అవార్డు అందుకున్న శాంతయ్య

కళాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలి



కళాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందించాలి. అన్ని మండల కేంద్రాల్లో కళావేదికల నిర్మాణం చేపట్టాలి. తెలంగాణ ప్రభుత్వమే ప్రతి సంవత్సరం నాటక పోటీలను నిర్వహిస్తే బాగుంటుంది. ప్రస్తుతం వృద్ధకళాకారులకు పింఛన్లు అందుతున్నాయి. వారికి ఇచ్చిన విధంగానే యువకళాకారులను కూడా ప్రభుత్వం ప్రోత్సహించి ఆదుకోవాలి.

-చిలివేరు శాంతయ్య, కళాకారుడు

క్షేత్రస్థాయి డాటా సేకరణలో

పొరపాట్లు జరగొద్దు

- ఇందిరమ్మ ఇళ్ల యాప్‌పై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలి
- 20లోగా దరఖాస్తుల డాటా సేకరణ పూర్తి చేయాలి
- మండల అధికారులకు యాప్‌పై శిక్షణ కార్యక్రమంలో ఖమ్మం కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంటౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల యాప్ ద్వారా క్షేత్రస్థాయి డాటా సేకరణలో పొరపాట్లకు తావులేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, మునిసిపల్ కమిషనర్లకు ఇందిరమ్మ ఇళ్ల యాప్‌పై ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, అధికారులకు అవగాహన కల్పించారు. ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తుల డాటా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మది ఒక బృహత్తర కార్యక్రమమని అన్నారు. దీనిని రొటీన్ కార్యక్రమంలా చూడవద్దని, పేదవారికి శాశ్వత ఇంటి హక్కు ఇస్తున్నట్టు కలెక్టర్ పేర్కొన్నారు. దరఖాస్తుల పరిశీలనలో జాగ్రత్తలు తీసుకోవాలని, కుటుంబం బీపీఎల్ కేటగిరీకి చెందినదై ఉండాలని, లబ్ధిదారుడు స్వంత స్థలంకానీ, ప్రభుత్వం అందించిన స్థలంకానీ కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల్లో సూచించిన మార్గదర్శకాల మేరకు ప్రాధాన్యత క్రమం చూపాలన్నారు. పేర్లు, ఇంటి నెంబర్లు, డాక్యుమెంట్ల నమోదులో స్పెల్లింగ్ తప్పులు దొర్లకుండా కచ్చితమైన డాటా పొందుపర్చాలన్నారు. ఏఏ ఆధారాలు తనిఖీ చేయాలో, ఏవి పొందుపర్చాలో పూర్తి అవగాహన ఉండాలన్నారు. దరఖాస్తుదారులకు ముందస్తుగా సమాచారం ఇచ్చి ఏఏ వివరాలు, ఆధారాలు సిద్ధంగా ఉంచుకోవాలో అవగాహన కల్పించాలన్నారు. గ్రామ పంచాయతీ, వార్డు కార్యాలయాల్లో వీటికి సంబంధించిన ఫ్లెక్సీలు ప్రదర్శించాలన్నారు. ముందస్తుగా రోజువారి, వారంవారి షెడ్యూల్ రూపొందించి, విస్తృత ప్రచారం చేయాలని, ప్రజలకు షెడ్యూల్ చేరుకునేలా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి రోజు కనీసం 30దరఖాస్తుల పరిశీలన పూర్తయ్యేలా లక్ష్యం పెట్టుకోవాలని, ఈ దిశగా కార్యాచరణ చేయాలన్నారు. ఆయా ప్రాంతాల్లో నెట్‌వర్క్ బాగా ఉన్న సర్వీస్ ప్రొవైడర్‌ను ఎంచుకొని, నెట్‌వర్క్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లక్ష్యాలను ప్రతిరోజూ మానిటరింగ్ చేయాలని .శిక్షణ పొందిన మండల అధికారులు, వెంటనే తమ తమ మండలాలకు చేరుకొని క్షేత్రస్థాయి అధికారులకు శిక్షణ ఇవ్వాలని, క్షేత్రస్థాయి దరఖాస్తుల పరిశీలన శనివారం నుంచే ప్రారంభంకావాలని తెలిపారు. శిక్షణలో ఈడీఎం దుర్గాప్రసాద్, యాప్ ఇన్‌స్టాలేషన్, యాప్ ఉపయోగ విధానం, లైవ్ ఉదాహరణలతో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, డీఆర్వో రాజేశ్వరి, జడ్పీ సీఈవో దీక్షా రైనా, డీఆర్డీవో సన్యాసయ్య, డీపీవో ఆశాలత, ఆర్డీవోలు నర్సింహారావు, ఎల్.రాజేందర్, హౌజింగ్ ఈఈ శ్రీనివాసరావు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీవోలు, అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఏసీ బస్సుల టికెట్ చార్జీలపై

10 శాతం సబ్సిడీ

ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సరిరాం

ఖమ్మం ఖానాపురంహవేలి డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్ రవాణా సంస్థ అన్ని ఏసీ బస్సుల్లో బేసిక్ టికెట్ చార్జీపై 10శాతం సబ్సిడీని అందిస్తుందని ఖమ్మం ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సరిరాం తెలిపారు. ఏసీ, స్లీపర్, రాజధాని బస్సుల్లో ఈ నెల 31వరకు ఈ ప్రత్యేక ఆఫర్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఖమ్మం నుంచి హైద్రాబాద్‌కు రూ.490ఉండగా ఆఫర్‌తో రూ.450, ఖమ్మం నుంచి విశాఖపట్నానికి రూ.1020 ఉండగా ఆఫర్‌తో రూ.930 సత్తుపల్లి నుంచి బీహెచ్‌ఈఎల్‌కు రూ.730ఉండగా.. ఆఫర్‌తో రూ.700లు, పాల్వంచ నుంచి మియాపూర్‌కు రూ.770ఉండగా ఆఫర్‌తో రూ.710చార్జీతో ప్రయాణించవచ్చునని ఆర్ఎం తెలిపారు. ఏసీ బస్సులు నడిసే అన్ని రూట్లలో ఈ సదుపాయం అందుబాటులో ఉంటుందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఐటీసీకి చేరుకున్న దేవాదాయ శాఖ కమిషనర్

భద్రాచలం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ శనివారం బూర్గంపాడులోని సారపాక ఐటీసీ అతిథిగృహానికి చేరుకున్నారు. దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి వైదిక పరిపాలన అధికారులు ఆయనకు మర్యాద పూర్వకంగా కలిశారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆయన భద్రాద్రి రామయ్యను ఆదివారం దర్శించుకోనున్నట్లు దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి. ఇది పూర్తిగా వ్యక్తిగతమేనని పేర్కొంటుండగా.. రామాలయ పరిసరాల్లో వైకుంఠ ఏకాదశికి చేపట్టే ఏర్పాట్లు, రామాలయ అభివృద్ధి పనులు చేపట్టే క్రమంలో భూ సేకరణ ఎంతవరకు చేపట్టనున్నారు తదితర వాటిని పరిశీలించనున్నట్లు తెలుస్తోంది.



ప్రసంగిస్తున్న న్యాయాధికారి ఎం.శ్రీనివాస్

చట్టాలపై అవగాహన ఉంటే...

దేశ, సమాజాభివృద్ధి సాధ్యం

సత్తుపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): చట్టాలపై అవగాహన ఉంటే భవిష్యత్‌లో దేశ, సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని 6వ అదనపు జిల్లా జడ్జి మారగాని శ్రీనివాస్ అన్నారు. శిక్షణ పొందుతున్న కానిస్టేబుల్ ఉద్యోగులకు మండలంలోని గంగారంలోని 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో సత్తుపల్లి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయచైతన్య సదస్సు నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే భవిష్యత్‌లో విధి నిర్వహణలో భాగంగా శాంతిభద్రతలను పటిష్ఠంగా నిర్వహించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌కే.మీరాఖాసీం సాహెబ్, అసిస్టెంట్ కమాండెంట్ ఎస్‌డీ.రంగారెడ్డి, బెటాలియన్ ట్రైనింగ్ ఆర్ఐ సీహెచ్‌వీ.శ్రీనివాసరెడ్డి, ఆర్ఎస్ఐలు, ట్రైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

బావమరిదిపై బావ కాల్పులు

- కాలుకు గాయం.. త్రుటిలో తప్పిన ప్రాణాపాయం
- పాత పాల్వంచలో ఘటన



కాలుకు గాయమైన దృశ్యం

పాల్వంచ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం తేవాలని ఓ గృహిణిపై భర్త వేధింపులకు పాల్పడగా పద్ధతి మార్చుకోవాలని సూచించిన ఆమె కుటుంబ సభ్యులపై భర్త ఎయిర్‌గన్‌తో కాల్పులు జరిపాడు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామానికి చెందిన జిలానీ అనే వ్యక్తికి అదే ప్రాంతానికి చెందిన మహ్మద్ సిరాజ్ తన అక్కను ఇచ్చి వివాహం జరిపించాడు. వీరికి ముగ్గురు సంతానం ఉన్నారు. అయితే కొంతకాలంగా జిలాని రోజు మద్యంతాగి వచ్చి అసభ్య పదజాలంతో దూషిస్తూ భార్యను కొడుతున్నాడు. దాంతో వైఖరి మార్చుకోవాలని పలుమార్లు బామ్మర్ది సిరాజ్ హితవు పలికినా బావ వినకపోవడంతో సిరాజ్ తన అక్కను పాల్వంచలోని తమ ఇంటికి తీసుకెళ్లాడు.

ఈ క్రమంలో భార్య, బామ్మర్దిపై కక్ష పెంచుంచుకున్న జిలానీ శుక్రవారం తెల్లవారుజామున సుమారు మూడు గంటల సమయంలో ఒక కారులో పాత పాల్వంచకు వచ్చాడు. తనతో పాటు మరో ఇద్దరితో కలిసి వచ్చి సిరాజ్ ఇంటి తలుపులను పగలగొట్టి లోనికి ప్రవేశించి దూషిస్తూ ఇంట్లోని వారిపై దాడి చేశాడు. ఈ క్రమంలో తనతో తెచ్చుకున్న ఎయిర్‌గన్‌తో మూడుసార్లు కాల్పులు జరిపాడు.

భయభ్రాంతులకు గురైన కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో నిందితుడు జిలాని పారిపోతూ మరోసారి కాల్పులు జరిపాడు. దీంతో బామ్మర్ది సిరాజ్ కుడి కాలుపై బుల్లెట్ గాయమైంది. స్థానికులు అతడిని పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బుల్లెట్ తొడ భాగంలో ఉండటంతో ఆపరేషన్ చేసి తొలిగించారని వైద్యులు తెలిపారు. కాల్పులకు పాల్పడిన జిలానీతో పాటు అతడికి సహకరించినవారిని పోలీసుల అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. బాధితుడు సిరాజ్ ఫిర్యాదు మేరకు పాల్వంచ టౌన్ ఎస్‌హెచ్‌వో సుమన్ శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏడాది పాలనలో

అభివృద్ధి శూన్యం

(3వ పేజీ తరువాయి)

ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. కేంద్రంలో బీజేపీ మతకలహాలు, ఘర్షణలను ప్రోత్సహిస్తుందన్నారు. అయితే బీజేపీ దుర్మార్గాన్ని ప్రజలు అర్థం చేసుకోవడం వల్లనే గతంలో కంటే లోక్‌సభలో బలం తగ్గిందని పేర్కొన్నారు. బీజేపీ దుర్మార్గ పాలన నుంచి దేశాన్ని కాపాడుకోవడం కోసం కాంగ్రెస్‌కు మద్దతు తెలిపామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో పేదప్రజలకు వ్యతిరేకంగా ఏ నిర్ణయాలు తీసుకున్నా సీపీఎం పార్టీ చూస్తూ ఊరుకోదని పేదల పక్షానే ఉంటుందన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పోతినేని సుదర్శన్, రాష్ట్ర నాయకుడు సాయిబాబా, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ పొన్నం వెంకటేశ్వరరావు, డివిజన్ నాయకులు బండి పద్మ, బండి రమేష్, మాదినేని రమేష్, శీలం నర్సింహారావు, చింతలచెర్వు కోటేశ్వరరావు, మందా సైదులు, పాపినేని రాంనర్సయ్య, దీవెల వీరయ్య, పడకంటి మురళీ, దొండపాటి నాగేశ్వరరావు, గోపాలరావు, సీఐటీయూ జిల్లా నాయకుడు కల్యాణం వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ మందడపు ఉపేంద్ర పాల్గొన్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి

(3వ పేజీ తరువాయి)

నిర్మించిన రైల్వే మినీ అండర్‌బ్రిడ్జిని మంత్రి తుమ్మల శనివారం ప్రారంభించారు. అనంతరం మామిళ్లగూడెంలో మాజీ కార్పొరేటర్ యర్రం బాలగంగాధర్‌తిలక్ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని ఖమ్మం పట్టణ అభివృద్ధికి అనుగుణంగా పట్టణ మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేయాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మం ఖిల్లాను కూడా పర్యాటకంగా అభివృద్ధి చేసే పనులకు టెండర్లు పిలవడం జరుగుతుందని, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే బాధ్యత అందరిపై ఉదన్నారు. ఎంతో చరిత్ర కలిగిన ఖమ్మం పట్టణంలో అందరు కలిసి మెలిసి సుఖసంతోషాలతో ఉండాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా ప్రజలకు అవసరమైన రైల్వే అండర్ బ్రిడ్జి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. నాడు ఎమ్మెల్యేగా తాను మంజూరు చేయించిన పనిని నేడు మంత్రిగా తానే ప్రారంభించడం గర్వకారణమన్నారు.

ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ మాట్లడుతూ ఖమ్మం ప్రజలు అభివృద్ధికి సహకరించడంతో పాటు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేందకు సహకరించాలని కోరారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ ఖమ్మం పట్టణ జనాభా అధికంగా విస్తరిస్తోందని, జిల్లా జనాభా 27లక్షల వరకు చేరుకుందని, ఖమ్మం కార్పొరేషన్ లోనే 7లక్షలవరకు జనాభా ఉందని ప్రణాళికబద్ధంగా మాస్టర్‌ప్లాన్ ఏర్పాటుచేసి రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా అటవీ అధికారి సిద్ధార్థవిక్రంసింగ్ మాట్లాడుతూ వెలుగుమట్లపార్కుకు రూ.3కోట్లు నిధులు మంజూరయ్యాయని, తద్వారా ఈపార్కులో విద్యార్థులకు అవసరమైన పరిజ్ఞానాన్ని ఏర్పాటు చేయబోతున్నామని, వెలుగుమట్ల పార్కులో జింకల పార్కు ఏర్పాటుతోపాటు సైక్లింగ్, బోటింగ్ వంటి సౌకర్యాలు ఏర్పాటుచేస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో ఇంకా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, పోలీసుకమిషనర్ సునిల్‌దత్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు వైష్ణవి, దుద్దుకూరి వెంకటేశ్వరరావు, మాజీ కార్పొరేటర్లు బాలగంగాధర్‌తిలక్, దీపక్‌చౌదరి, వడ్డెబోయిన నర్సింహారావు, అంజయ్య తదితరులు ప్రసంగించారు. అనంతరం మంత్రిగా ప్రమాణం చేసి ఏడాదైన సందర్భంగా తుమ్మలను మేయర్ నీరజ, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థచైర్మన్ రాయల నాగేశ్వరరావు సత్కరించారు.

రూ.15 లక్షలు కొట్టేశారు...

- విశ్రాంత ఉద్యోగిని నిండా ముంచిన సైబర్ నేరగాళ్లు
- వీడియో కాల్ చేసి సీబీఐ కేసులో అరెస్టు చేస్తామని హెచ్చరిక

వైరా, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అమాయకత్వం, భయంతో ఓ విశ్రాంత ఉద్యోగి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్నాడు. రూ.15లక్షలు తన బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్ల ఖాతాకు అర్పించుకున్నాడు. ఆ తర్వాత ఈ విషయం బంధువులకు తెలియడంతో వెంటనే వారు బాధితుడితో వైరా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. శుక్ర, శనివారాల్లో ఈ సైబర్ నేరగాళ్ల బెదిరింపులతో విశ్రాంత ఉద్యోగి ఊటుకూరి నర్సింహారావు భయంతో భీతిల్లిపోయాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..

వైరా మునిసిపాలిటీ 13వ వార్డులోని ఓ పెట్రోల్ బంక్ సమీపంలో ఉంటున్న ఊటుకూరి నర్సింహారావు ఉమ్మడి వరంగల్ జిల్లా కమలాపురంలోని ఓ పేపర్‌బోర్డులో ఉద్యోగిగా పనిచేసి మూడేళ్ల క్రితం రిటైర్ అయ్యాడు. ఈయనకు ఒక కుమారుడు,కుమార్తె ఉన్నారు. వీరికి వివాహాలై హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. నర్సింహారావు భార్యతో కలిసి వైరాలో నివాసముంటున్నాడు. ఆయనకు శుక్రవారం మధ్యాహ్నం వాట్సాప్ నుంచి ఓ ఫోన్‌కాల్ వచ్చింది. తాము ఢిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి ఫోన్ చేస్తున్నామని మీరు ఐదు విమాన టిక్కెట్లు బుక్ చేసుకున్నారని, ఎక్కడికి వెళ్తున్నారని ప్రశ్నించారు. దాంతో తాను ఎలాంటి విమాన టిక్కెట్లు బుక్ చేయలేదని నర్సింహారావు సమాధానమిచ్చాడు. మీ టికెట్ల విషయం ఏదో తేడాగా ఉందని సీబీఐకి ఫిర్యాదు అందిందని సదరు వ్యక్తి బెదిరించాడు.

ఆ వెంటనే ముగ్గురు వ్యక్తులు వీడియోకాల్‌లోకి వచ్చి నర్సింహారావుతో మాట్లాడుతూ బెదిరింపులకు పాల్పడ్డారు. వారు తమ ముఖాలు కన్పించకుండా జాగ్రత్త పడ్డారు. 'మీ దగ్గర హవాలా డబ్బు ఉంది.. మోసంతో హవాలా వ్యాపారం చేస్తున్నారు.. సుప్రీంకోర్టు నుంచి ఈ మేరకు సమన్లు వచ్చాయి.. ఈ కేసులో మిమ్మల్ని అరెస్టు చేయాల్సి ఉంటుంది..' అని బెదిరించారు. అరెస్టు చేయకుండా విచారించాలంటే సుప్రీంకోర్టు సమన్ల మేరకు రూ.15లక్షలు సుప్రీంకోర్టు ఆడిట్ విభాగానికి జమచేయాలని ఆదేశించారు. ఈ విషయాన్ని మీ బంధువులకు, స్నేహితులకు, పోలీసులకు ఇతరులు ఎవరికి చెప్పినా వెంటనే అరెస్టు చేస్తామని బెదిరించారు. దీంతో నర్సింహారావు భయకంపితుడయ్యారు. అలాగే శనివారం కూడా సైబర్ నేరగాళ్ల నర్సింహారావుకు వీడియోకాల్ చేసి బెదిరించారు. కోల్‌కతాలోని బంధన్ బ్యాంకులోని రామా ఎంటర్‌ప్రైజస్ ఖాతాలో రూ.15లక్షలు జమ చేయాలని లేకపోతే అరెస్టు చేస్తామని బెదిరించారు.

దీంతో భయపడిపోయిన నర్సింహారావు శనివారం మధ్యాహ్నం వైరాలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌కు వెళ్లి ఉన్న తన ఖాతా నుంచి సైబర్ కేటుగాళ్లు ఆదేశించిన ఖాతా నెంబర్‌కు రూ.15లక్షలు బదిలీ చేశాడు. అయినా మళ్లీ ఫోన్ చేసి మరో రూ.5 లక్షలు బదిలీ చేయాలని బెదిరింపులకు దిగారు. ఆ తర్వాత కొంతసేపటికి తమ ఇంటికి వచ్చిన బంధువులకు నర్సింహారావు జరిగిన విషయాన్ని చెప్పాడు. ఆ వెంటనే బంధువులు నర్సింహారావుకు ధైర్యం చెప్పి వైరా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. వైరా పోలీసులు కేసు నమోదుచేసి రాష్ట్ర సైబర్ క్రైం విభాగానికి బదిలీ చేశారు. తన తల్లిపేరిట ఉన్న భూమిని అమ్మగా వచ్చిన రూ.15లక్షలను నర్సింహారావు అమాయకత్వంతో సైబర్‌నేరగాళ్లకు అర్పించుకున్నాడు.

తల్లి మందలించిందని..

- ఉరేసుకుని ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య
- అశ్వారావుపేటలో విషాదం

అశ్వారావుపేట రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తల్లి మందలించిందని ఓ ఇంటర్ విద్యార్థిని క్షణికావేశంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన భద్రాద్రి జిల్లా అశ్వారావుపేటలో శనివారం ఉదయం జరిగింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అశ్వారావుపేటలోని దండాబత్తుల వీధిలో కిరాణ వ్యాపారం చేసుకున్న సామినేని వెంకన్న, వరలక్ష్మి దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతుండగా కుమార్తె జేశ్వరి సాయి(16) అదే కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. రోజు మాదిరిగానే శనివారం ఉదయం కళాశాలకు వెళ్లే క్రమంలో లంచ్ బాక్స్ సిద్ధం చేసుకుంటుండగా కూర లేకపోవటంతో తల్లి రాత్రి వండిన కూరను వేసుకుని వెళ్లాలని జేశ్వరి సాయికి సూచించింది. దీంతో రాత్రి వండిన కూర తనకు వద్దని ఆమె తల్లితో గొడవపడింది. ఈ క్రమంలో తల్లి జేశ్వరి సాయిని మందలించింది.

అనంతరం తండ్రి వెంకన్న కిరాణా దుకాణానికి వెళ్లగా తల్లి వరలక్ష్మి కూరగాయలు తెచ్చేందుకు దుకాణానికి వెళ్లింది. ఇదే సమయంలో విద్యార్థిని జేశ్వరి సాయి ఇంట్లో ఉన్న కొక్కానికి వైరుతో ఉరివేసుకుంది. కూరగాయలు తీసుకుని వచ్చిన తల్లి ఇంట్లో కూతురు ఉరికి వేలాడుతూ కనిపించటంతో పెద్దగా కేకలు వేసింది. కుటుంబసభ్యులు వచ్చి బాలికను ఆసుపత్రికి తరలించగా పరీక్షించినవ వైద్యులు ఆమె అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న అశ్వారావుపేట ఎస్ఐ యాయాతిరాజు ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్కులు తక్కువ వచ్చాయని

మందలించడంతో..

- ఉరి వేసుకొని ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మార్కులు తక్కువ వచ్చాయని తల్లిదండ్రులు మందలించారని ఓ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో శనివారం జరిగింది. కొత్తగూడేనికి చెందిన కాశీబోయిన శ్రీనివాసరావు, లక్ష్మి దంపతులకు ఒక కుమార్తె మేఘన (18), కుమారుడు ఉన్నారు. మేఘన కొత్తగూడెంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది.

అయితే కళాశాలలో నిర్వహించే వారాంతపు పరీక్షల్లో మార్కులు తక్కువ ఎందుకు వచ్చాయని శనివారం మేఘనను తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్థాపం చెందిన విద్యార్థిని ఇంట్లో ఉరి వేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే కొత్తగూడెంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా మృతిచెందింది. ఈ ఘటనపై తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కొత్తగూడెం త్రీటౌన్ ఎస్ఐ మస్తాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈ పార్కులో ప్రేమికులకు

అనుమతి లేదు

- ఖమ్మం నగరంలోని తెలంగాణ ఫ్రీడం పార్కు వద్ద కేఎంసీ హెచ్చరిక బోర్డు



ఫ్రీడం పార్కులో లవర్స్‌కు అనుమతి లేదు.. అని ఏర్పాటు చేసిన బోర్డు

ఖమ్మంటౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సాధారణంగా పార్కుల్లో అందరికి అనుమతి ఉంటుంది. కానీ ఖమ్మం నగరంలోని 53వ డివిజన్‌లో ఉన్న తెలంగాణ ఫ్రీడం పార్కులో మాత్రం "లవర్స్‌కు (ప్రేమికులు) అనుమతి లేదు" అని నగరపాలక సంస్థ సిబ్బంది బోర్డును ఏర్పాటు చేయటం చర్చనీయాంశమైంది. ఈ పార్కులోకి ప్రేమికులను అనుమతించేదిలేదని మునిసిపల్ అధికారులు చెబుతున్నారు. ఖమ్మం నగరంలోని నగరపాలకసంస్థ కార్యాలయం పక్కనే సుమారు రూ.30లక్షలతో ఈ పార్కును ఏర్పాటు చేశారు. అమరజవాన్లకు నివాళిగా ఇక్కడ ఒక స్థూపం నిర్మించటంతో ఈ పార్కుకు 'తెలంగాణ ఫ్రీడం పార్క్' అని పేరు పెట్టారు. కాగా సదరు పార్కులో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు అందడంతో మునిసిపల్ సిబ్బంది "పార్కులో లవర్స్‌కు అనుమతి లేదు" అనే బోర్డు ఏర్పాటు చేశారు. కొన్ని ప్రేమ జంటలు గంటల తరబడి పార్కులో కూర్చుని అభ్యంతరకరంగా ప్రవర్తించటంతో ఇక్కడికి వాకింగ్‌కు వచ్చే మహిళలు ఇబ్బంది పడుతున్నారు. దాంతో ఇప్పటికే ఈ పార్కులో కొన్ని నిబంధనలు విధించగా తాజాగా "లవర్స్‌కు అనుమతి లేదు" అనే నిబంధనను చేర్చి నగరపాలకసంస్థ సిబ్బంది బోర్డు పెట్టడంపై పలువురు చర్చించుకుంటున్నారు.

మ్యూజియం పనులు పూర్తి చేయాలి

» ఐటీడీఏ పీవో బి.రాహుల్



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీవో

భద్రాచలం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భద్రాచల ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో గిరిజన మ్యూజియం అభివృద్ధి పనులను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. శనివారం గిరిజన మ్యూజియం అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనుల ఆచార, వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనమైన మ్యూజియంను తిలకించడానికి వచ్చే యాత్రికులకు అందించడానికి నిర్మాణం చేపడుతున్న కుటీరాలు, పిల్లలు సరదాగా ఆడుకోవడానికి క్రీడా స్థలం ఏర్పాట్ల పనులు, బోటింగ్ సౌకర్యం పనులు తొందరగా పూర్తి చేయాలన్నారు. యాత్రికులు గిరిజనులకు సంబంధించిన వివిధ కళాకృతులతో సెల్ఫీలు, ఫొటోలు దిగడానికి ప్రత్యేకంగా హాలు ఏర్పాటు చేయాలని, గిరిజనుల పాత కాలపు వేటాడే వస్తువులను, ఆర్చరీ ఇతర వస్తువులు చిన్న పిల్లలు ఆడుకోవడానికి అనువుగా ఉండేలా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజు, డీడీ మణెమ్మ, ఎఫ్‌డీసీ ఉదయ్‌కుమార్, డీఈ హరీష్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, మ్యూజియం ఇన్‌చార్జి వీరస్వామి, మట్టి, వెదురుతో వివిధ స్టాల్స్ ఏర్పాటు చేసే డిజైనర్లు శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

కొర్రీలు మొదలాయే..

» ధాన్యం దిగుమతులకు మిల్లర్ల పేచీలు
» గరికపాడు, పూసలపాడు సొసైటీల్లో తిరకాసు
» ఎంటీయూ 1262 రకాన్ని తీసుకొనేందుకు నిరాకరిస్తున్న మిల్లర్లు
» ఎఫ్‌సీఐ, సీఎం రైస్ నుంచి అభ్యంతరాలు న్నాయంటున్న యజమానులు
» అధికారులు స్పందించడంతో రైతులకు తాత్కాలిక ఉపశమనం



రోజంతా రోడ్డుపైనే ధాన్యం లోడ్‌తో ఉన్న లారీ

వైరా, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లపై ఇప్పుడిప్పుడే మిల్లర్లు కొర్రీలు వేస్తూ పేచీలకు దిగుతున్నారు. ఇప్పటి వరకు వరికోతలు అంతంతమాత్రమే ఉండటంతో ఎలాంటి సమస్య ఎదురుకాలేదు. రెండు, మూడురోజుల నుంచి మిల్లర్లు ధాన్యం దిగుమతుల విషయంలో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ముఖ్యంగా ఎంటీయూ 1262రకం ధాన్యాన్ని దిగుమతి చేసుకొనేందుకు నిరాకరిస్తున్నారు. శనివారం వైరా మండలంలోని పూసలపాడు సొసైటీలో కొంతమంది రైతుల విషయంలో సమస్య వెలుగులోకి వచ్చింది. ఒక రోజంతా 7140ధాన్యం బస్తాలతో లోడ్ చేసిన లారీ రోడ్డుపైనే నిలిపివేయడంతో ఆ ధాన్యం రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వెంటనే పూసలపాడు సొసైటీ అధ్యక్షుడు గాలి శ్రీనివాసరావు స్పందించి ఈ సమస్యను పౌరసరఫరాలు, వ్యవసాయ, సహకారశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఖమ్మంలోని ఓ రైస్‌మిల్లు యాజమాన్యం వైఖరిని తీవ్రంగా తప్పుపడుతూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆమేరకు వెంటనే అన్నిశాఖల అధికారులు స్పందించారు. పౌరసరఫరాలశాఖ క్వాలిటీ కంట్రోల్ అధికారి రామచంద్రరావు పూసలపాడు చేరుకొని ధాన్యాన్ని పరిశీలించారు. ఈ ధాన్యం ఎంతో నాణ్యతతో ఉన్నాయని నిర్ధారించి వెంటనే ధాన్యం లోడ్‌తో ఉన్న లారీని వైరాలోని ఓ రైస్‌మిల్లుకు పంపించటంతో రైతులకు తాత్కాలిక ఉపశమనం లభించింది.

క్వాలిటీ ధాన్యానికి కొర్రీలు..

పూసలపాడు సొసైటీ పరిధిలోని నారపనేనిపల్లి గ్రామానికి చెందిన శీలం హనిమిరెడ్డి, అంజిరెడ్డి, వేమిరెడ్డి బిక్షారెడ్డి, యరమల వెంకటేశ్వర్‌రెడ్డి, గుడిద కృష్ణ, యరమల వెంకటేశ్వర్‌రెడ్డికి చెందిన ఎంటీయూ 1262రకం ధాన్యం 710బస్తాలను లారీలో లోడ్‌చేశారు. ఖమ్మం మమత రోడ్డులో ప్రముఖ విద్యా, వ్యాపార సంస్థలకు చెందిన ఓ రైస్‌మిల్లు యజమాని ఆదేశాల మేరకు శుక్రవారం సంబంధిత సిబ్బంది నారపనేనిపల్లి, పూసలపాడుల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చి 1262 ధాన్యాన్ని పరిశీలించారు. జిల్లాలోని ఎక్కడా లేనివిధంగా ఎంతో క్వాలిటీతో ఈ ధాన్యం ఉన్నాయని ఈధాన్యం మొత్తాన్ని తామే దిగుమతి చేసుకుంటామని పూసలపాడు సొసైటీ అధికారులు, సిబ్బందికి చెప్పి వెళ్లిపోయారు. దాంతో ఆమిల్లుకు ఈ ధాన్యాన్ని తరలించేందుకుగానూ లారీలో లోడ్ చేయగా అదే మిల్లు నిర్వాహకులు పూసలపాడు సొసైటీ అధికారులకు ఫోన్ చేసి తమకు ఎంటీయూ 1262రకం ధాన్యం వద్దని, తమ మిల్లుకు వాటిని పంపించొద్దని, ఒకవేళ వచ్చినా తాము దిగుమతి చేసుకోబోమని స్పష్టం చేశారు. సొసైటీ అధికారులు వెంటనే ఈ విషయాన్ని సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరావుకు తెలియజేశారు. దీంతో మూడుశాఖల అధికారులకు శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు.

ఎఫ్‌సీఐ, సీఎంఆర్ అభ్యంతరాలు ఉన్నాయంటూ...

తాము దిగుమతి చేసుకున్న ధాన్యాన్ని బియ్యం చేసి ఎఫ్‌సీఐకు, సీఎం రైస్ కింద ప్రభుత్వానికి ఇచ్చే సమయంలో తీసుకొనేందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తూ నిరాకరిస్తున్నారని మిల్లర్లు తమ చర్యలను సమర్థించుకుంటున్నారు. గరికపాడు సొసైటీలో కూడా ఇప్పటివరకు 1262రకానికి చెందిన ధాన్యాన్ని సంబంధిత మిల్లుల వారు ఒక్కో లోడ్‌ను మాత్రమే దిగుమతి చేసుకున్నారని, మళ్లీ ఆరకం ధాన్యాన్ని తమకు పంపిస్తే దిగుమతి చేసుకోబోమని స్పష్టం చేశారు. దీంతో ఏమీ చేయాలో అర్థం కావడం లేదని ఆసొసైటీ అధికారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు పూసలపాడు సొసైటీలో కూడా అదే పరిస్థితి తలెత్తడంతో తాత్కాలికంగా రైతులకు ఉపశమనం కలిగించారు. ఇప్పుడిప్పుడే 1262రకం వరికోతలు ముమ్మరంగా మొదలయ్యాయి. కొద్దిరోజుల్లో ఆరకం ధాన్యం అందుబాటులోకి వస్తుంది. మిల్లర్లు ఇప్పటి నుంచే కొర్రీలు వేస్తుండటంతో తమ పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన చెందుతున్నారు. అందువలన ప్రభుత్వ అధికారులు ముందుగానే ఈ సమస్య తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పాఠశాల సమయాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిషేధం

కొత్తగూడెం అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల హడావుడి మొదలైంది. ఖమ్మం, నల్లగొండ, వరంగల్ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పదవీకాలం వచ్చే ఏడాది మార్చి 29న ముగుస్తుండగా.. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల ప్రక్రియను ప్రారంభిస్తూ గత నెల 30న నోటిఫికేషన్ జారీ చేసింది. గతంలో రాష్ట్ర చీఫ్ ఎన్నికల అధికారి సూచనలమేరకు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. విద్యాసంస్థల పరిసరాల్లో పాఠశాలల సమయంలో ఎలాంటి ప్రచారం చేయరాదని, ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదని శనివారం డీఈవో వెంకటేశ్వరాచారి, డీఐఈవో హెచ్. వెంకటేశ్వరరావును జిల్లాకలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. విద్యాసంస్థల్లో బోధన సమయాల్లో టీచర్స్ యూనియన్ నాయకులు ప్రచారం పేరుతో ఆటంకం కలిగించరాదని, ఎన్నికల నియామవళిని ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముక్కోటి ఏకాదశికి సంబంధించిన పనులను త్వరగా పూర్తి చేయాలి

» ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న పీవో

భద్రాచలం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశికి గ్రామ పంచాయతీ తరపున చేపట్టే పనులను త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అధికారులను ఆదేశించారు. శనివారం భద్రాచలంలో నిర్మాణం పూర్తయిన డంపింగ్ యార్డును ఆయన పరిశీలించారు. అనంతరం రాహుల్ మాట్లాడుతూ భద్రాచలంను ఎప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీ సిబ్బందిపై ఉందని, ఎప్పటికప్పుడు తడి, పొడి చెత్తను ప్రత్యేకంగా సేకరిస్తూ డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. పంచాయతీ ఈవో, సిబ్బంది పట్టణంలో పర్యటిస్తూ వార్డుల్లో చెత్త సేకరణను పరిశీలించాలని, డ్రైనేజీల్లో పూడికను ఎప్పటికప్పుడు తొలగిస్తూ ఉండలన్నారు. డంపింగ్ యార్డుకు తరలించిన పొడి చెత్త రీ సైక్లింగ్ చేయాలని, తడి చెత్త ట్రఫర్‌లో వేసి ఎండబెట్టి పొడరు చేసి వంట చెరుకు కోసం ఉపయోగించే విదంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు లాభాల వాటా

» సింగరేణి సీఏండీ బలరాం వెల్లడి

కొత్తగూడెం, డిసెంబర్ 07 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 1 ఏప్రిల్ 24 నుంచి 30సెప్టెంబరు 24 వరకు పనిచేసి రిటైరయిన అధికారులు, కార్మికులకు లాభాల వాటా సొమ్మును విడుదల చేసేందుకు ఆదేశాలు జారీచేశామని సీఏండీ బలరాం అన్నారు. ఈనెల 12న వారి ఖాతాల్లో బోనస్ సొమ్ములు జమ అవుతాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రిటైరయిన 2,035మంది కార్మికులకు లాభాల వాటా కింద రూ.33కోట్లను విడుదల చేశామని, ఈనెల 12న విశ్రాంత ఉద్యోగుల ఖాతల్లో జమ చేసేందుకు తగు ఏర్పాట్లుచేయాలని ఆర్థిక, సిబ్బంది వ్యవహారాల శాఖ ఉన్నతాధికారులను ఆదేశించామన్నారు

నేడు జిల్లా స్థాయి వంటల పోటీలు

ఖమ్మం ఖానాపురంహవేలి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కుక్ కమ్ హెల్పర్‌లకు జిల్లా స్థాయి వంటల పోటీలు ఆదివారం నగరంలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి ఎంపిక చేసిన కుక్ కం హెల్పర్లు ఈ పోటీల్లో పాల్గొంటారని విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పెంచే విధంగా ప్రభుత్వ చేపట్టే కార్యక్రమాల్లో భాగంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో విజేతను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిచటం జరుగుతుందని తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధురాలి మృతి



ఖమ్మం రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన స్వతంత్ర సమరయోధురాలు అంబటి అన్నపూర్ణమ్మ(93) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా నాయకులు తమ్మినేని కోటేశ్వరరావు, మండల కార్యదర్శి ఊరడి సుదర్శన్ రెడ్డి అన్నపూర్ణమ్మ మృతదేహాన్ని సందర్శించి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుబ్బారావు, ప్రభాకర్, గురుమూర్తి, సీపీఎం నాయకులు జక్కంపూడి కృష్ణ, నాగేశ్వరరావు, సీనియర్ పాత్రికేయులు తాళ్లూరి మురళికృష్ణ, సాగర్, మురారి, రవి కుమార్, చిన్న, రంగారావు, బీఆర్ఎస్ నాయకులు భాస్కర్ రావు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

వేర్వేరు చోట్ల గుండెపోటుతో ఇద్దరి మృతి



కె. సురేష్



ఎస్కే రహీం

అశ్వాపురం/ కల్లూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అశ్వాపురం, కల్లూరు మండలాల్లో శనివారం గుండె పోటుతో ఇద్దరు వ్యక్తులు కుప్పకూలారు. అశ్వాపురం మండల పరిధిలోని చింతిర్యాల కాలనీకి చెందిన కొండ సురేష్(38) అనే యువకుడు శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. సురేష్ ఉదయం ఇంట్లో ఉండగానే ఛాతిలో నొప్పి అంటూ కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు అతణ్ని ఆస్పత్రికి తరలించే లోపే మృతిచెందాడు. సురేష్ గ్రామీణ వైద్యుడిగా మండలంలో గుర్తింపు ఉంది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడు ..

కల్లూరులో ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికుడు శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. యూపీఎస్ రహదారి ప్రాంతానికి చెందిన ఎస్‌కే రహీం(45) తన కుటుంబ సభ్యులతో కలిసి ఖమ్మంలోని తమ బంధువుల ఇంట్లో జరగనున్న శుభాకార్యానికి ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి బయలుదేరారు. అంబేద్కర్ సెంటర్‌లో ఖమ్మం వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కారు. బస్సు కొత్త బస్టాండు దాటగానే ఆకస్మాత్తుగా రహీంకు గుండెపోటు వచ్చింది. బస్సు ఆపి కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళుతుండగా మృతి చెందాండు. రహీం కల్లూరులో ట్రాలీ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మృతునికి భార్య జమీల కుమారుడు, కుమార్తె ఉన్నారు.

లారీ బోల్తా.. ఒకరికి గాయాలు..



బోల్తాపడిన సుబాబుల్ లారీ

అశ్వారావుపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేటలో రాష్ట్రీయ రహదారిపై శనివారం ఉదయం కంచికచర్ల నుంచి రాజమండ్రి వైపునకు వెళుతున్న సుబాబుల్ లారీ బోల్తా పడింది. ప్రమాదంలో కర్రలు రోడ్డంతా పడిపోయాయి. లారీ డ్రైవర్ శ్రీనుకు స్వల్పంగా గాయాలు అయ్యాయి. ప్రమాదంలో కర్రలు రోడ్డుపై పడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పెద్ద పెద్ద గోతులు ఉండటంతో వాహనాలు ముందుకు కదలలేక, వెనక్కి రాలేక గోతుల్లోనే ఉండిపోయాయి. కాగా రోడ్డు ఉన్న గోతులే ప్రమాదానికి కారణమని ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన అధికారులు సాయంత్రానికి గోతులను పూడ్చి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు.

వీధికుక్కల దాడిలో బాలుడికి గాయాలు

అశ్వాపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతిర్యాల కాలనీలో శనివారం వీధికుక్కల దాడిలో బాలుడు తీవ్రగాయాల పాలయ్యాడు. చింతిర్యాల కాలనీకి చెందిన పులగడపు ధ్రువన్ అనే ఏడు సంవత్సరాల బాలుడు బజారు నుంచి ఇంటికి వెళుతుండగా కుక్కలు దాడి చేయటంతో తీవ్రగాయాల పాలయ్యాడు. బాలుడిని చికిత్స నిమిత్తం భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

» కూరగాయల వ్యాపారి దుర్మరణం

కూసుమంచి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై శనివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆగిఉన్న ఆటోను కారు ఢీకొట్టడంతో అందులో ఉన్న కూరగాయల వ్యాపారి బాణోతు సుందర్ నాయక్ దుర్మరణం చెందారు. పోలీసుల కథనం ప్రకారం నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన బానోత్ సుందర్ తన పొలంలో పండించిన కూరగాయలను భార్య జ్యోతితో కలిసి తన ఆటోలో ఆయాగ్రామాల్లో జరిగే సంతలకు వెళ్లి విక్రయిస్తుంటారు.

శనివారం నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురం గ్రామంలో జరిగే సంతకు కూరగాయలతో వెళుతుండగా హైవేపై గుర్వాయిగూడెం గ్రామం సమీపంలోకి రాగానే ఆటో మరమ్మతులకు గురయింది. దీంతో రోడ్డు పక్కకు పెట్టి చూస్తుండగా వెనుకనుంచి కారు డ్రైవరు అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ ఢీకొట్టాడు. దీంతో సుందర్‌కు కాళ్లు విరిగి, తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. అతడి వెంట ఉన్న భార్య జ్యోతికి స్వల్పగాయాలయ్యాయి. ఈమేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నేలకొండపల్లి మార్చురీకి తరలించి కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

వసతి సౌకర్యాలతో డిప్లొమా కాలేజీ

» కలెక్టర్ జితేష్ వి. పాటిల్



పాలిటెక్నిక్ కళాశాలకు స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

బూర్గంపాడు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థుల విద్యాభ్యాసం, అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినందున అనేక వసతి సౌకర్యాలతో మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ డిప్లొమా కళాశాల నిర్మాణం త్వరలో చేపడుతామని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. శనివారం బూర్గంపాడు మండల పరిధిలోని కృష్ణాసాగర్‌లో గల గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణం కోసం ఆయన పరిశీలించారు. గిరిజన విద్యార్థులు పదో తరగతి వరకు చదివి ఇంటర్ చదవకుండా పాలిటెక్నిక్ కోర్సు చేయడానికి సరియైన డిప్లొమా కాలేజీ జిల్లాలో లేనందున పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కృషి వల్ల కళాశాల మంజూరు అయిందని తెలిపారు. కానీ ప్రస్తుతం ఈ కళాశాల మణుగూరు నడుస్తుందన్నారు. నిర్మాణం పూర్తి కాగానే మణుగూరులో ఉన్న కళాశాలను కృష్ణసాగర్‌కు మారుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, కళాశాల ప్రిన్సిపాల్ దేవదాస్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నాగ ముని నాయక్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వాపురం మండల పరిధిలోని మిట్టగూడెం గురుకుల డిగ్రీ కళాశాలను శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ జితేష్ విపాటిల్ సందర్శించారు.

కోల్డ్‌స్టోరేజీలో మిర్చి బస్తా చోరీ

మధిర రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం దెందుకూరు వద్దగల వెంకటేశ్వర కోల్డ్‌స్టోరేజీలో శనివారం తెల్లవారుజామున 3గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆటోలో వచ్చిన ఇద్దరు వ్యక్తులు కోల్డ్‌స్టోరేజీ గేటు గుండా లోపలకు దూకారు. ఇద్దరు కలిసి రెండు మిరపకాయ టిక్కీ బస్తాలను తీసుకొని వస్తుండగా ,అటువైపుగా వెళ్తున్న వారు చూసి కేకలు వేస్తూ కోల్డ్‌స్టోరేజీ మేనేజర్‌కు ఫోన్ చేశారు. అక్కడే ఒక టిక్కీ బస్తాను వదిలేసి మరో బస్తాను ఆటోలో వేసుకొని పరారయ్యారు. ఈ దృశ్యాలు కోల్డ్‌స్టోరేజీ సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. కోల్డ్‌స్టోరేజీ యాజమాన్యం ఫిర్యాదు మేరకు మధిర రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రామచంద్రారెడ్డి



ఎర్రుపాలెం, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సఖినవీడు గ్రామానికి చెందిన యరమల రామచంద్రారెడ్డి యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈసందర్భగా శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర వ్యాప్తంగా విత్ ఐవైసీ యాప్ ద్వారా నిర్వహించిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో 97మంది అభ్యర్థులను దాటి అత్యధిక మెజారిటీతో రామచంద్రారెడ్డి గెలుపొందారు. విద్యార్థి నాయకుడిగా మొదలైన ఆయన ప్రస్థానం అంచలంచలుగా ఎదుగుతూ యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎదిగారు. రాష్ట్రంలో మారుమూల గ్రామం సఖినవీడు నుంచి హైదరాబాదువరకు ఉద్యమాలు, పోరాటాలు, రాజకీయాలు దాటకుని రాష్ట్రస్థాయి నాయకుడుగా ఎదిగిన రామచంద్రారెడ్డిని పార్టీనాయకులు అభినందించారు. తన గెలుపునకు కృషిచేసిన యూత్ కాంగ్రెస్ నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ఉద్దీపకము ఎంతో కీలకం..

» గిరిబాలల కోసం తీర్చిదిద్దిన ఐటీడీఏ పీఎంఆర్‌సీ బృందం
» ప్రాథమిక విద్య బలోపేతానికి పీవో చర్యలు
» ఐటీడీఏ పరిధిలోని ఏడువేల మంది విద్యార్థులకు లబ్ధి



పీఎంఆర్‌సీ రూపొందించిన ఉద్దీపకము పుస్తకాలు ఇవే

భద్రాచలం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ జీపీఎస్, ఆ శ్రమ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న గిరి బాలలకు 'ఉద్దీపకము' ఎంతో కీలకం కానుంది. ప్రాథమిక స్థాయిలో విద్యను బలోపేతం చేసేందుకు ఐటీడీఏ పీవో బి రాహుల్ పకడ్బందీ చర్యలు చేపట్టారు. స్వతహాగా విద్యపై ఆసక్తి ఉన్న పీవో గిరిబాలలకు ప్రాథమిక స్థాయిలో మరింత బలోపేతం చేయాలని భావించారు. ఇందులో భాగంగా ఐటీడీఏ పరిధిలోని విద్యాశాఖలో ఉన్న పీఎంఆర్‌సీ(ప్రాజెక్టు మానిటరింగ్ అండ్ రిసోర్స్ సెల్) బృందం ద్వారా ఆంగ్లం, గణితంలో విద్యార్థులకు ఉద్దీపకము పేరుతో వర్క్‌బుక్‌లను రూపొందించారు. ఈ సమయంలో ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులలో కొందరిని వారి ప్రతిభ ద్వారా గుర్తించి వారి చేత వర్క్‌బుక్‌లను రూపొందించారు. ఆంగ్లం, గణితంలో వర్క్ పుస్తకాలను ఇటీవల రూపొందించగా వాటిని 2024-25 విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అందించేందుకు ఇటీవల ముద్రణకు ఇవ్వగా అవి పీఎంఆర్‌సీకి చేరుకోవటంతో వాటిని విద్యార్థులకు అందజేస్తున్నారు.

గిరిజన ప్రభుత్వ పాఠశాలలు(జీపీఎస్) భద్రాద్రి జిల్లాలో 219, ఖమ్మం జిల్లాలో 14, ఆశ్రమ ప్రాథమిక పాఠశాలలు భద్రాద్రి జిల్లాలో 30, ఖమ్మంలో పది పాఠశాలల్లో చదువుతున్న ఏడువేల మంది విద్యార్థులకు ఈ ఉద్దీపకం పుస్తకం ద్వారా లబ్ధి చేకూరనున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

రూపకల్పన చేసిన పీవో

భద్రాచలం ఐటీడీఏ పీవోగా రాహుల్ బాధ్యతలు చేపట్టిన అనంతరం జీపీఎస్, ఆశ్రమ పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సమయంలో విద్యార్థుల ప్రతిభా పాటవాలను పరీక్షించగా కొందరి విద్యార్థుల తీరును ఆయన గమనించారు. ఇదే పరిస్థితి పలుచోట్ల విద్యార్థులలో తనకు తారస పడటంతో ప్రాథమిక విద్య పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉందని గుర్తించినట్లు సమాచారం. దీంతో విద్యాశాఖ అధికారులు, కీలక అధికారులతో సమావేశమై ప్రాథమిక విద్య బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సమయంలో ఐటీడీఏ పరిధిలో పని చేస్తున్న ఉపాధ్యాయులలో నిష్ణాతులను గుర్తించి వారి చేత మూడు, నాలుగు, ఐదు తరగతులకు ఉద్దీపకము వర్క్‌బుక్‌ను విద్యార్థుల కోసం రూపొందింపజేశారు.

సులభంగా, సరళంగా ఉచ్చరించేలా..

గిరిబాలలకు రూపొందించిన ఉద్దీపకములో భాష విద్యార్థులు సులభంగా, సరళంగా గుర్తించి ఉచ్చరించేలా ఉంటుంది. ముఖ్యంగా వీటిని భాష పరిజ్ఞానంతో పాటు ఉచ్చారణ, రాయటం, పదాల కూర్పు, వాక్యాల రూపకల్పన, ఏవిదం గా చేయాలి అనేది వివరించారు. అంతే కా దు గణితంలో అంకెలను గుర్తించటం ఎలా?, ఒకటి నుంచి తొమ్మిది వరకు అంకెలను ఏవి దంగా రాయాలి?, స్థాన విలువలు, కూడికలు, తీసివేతలు, ఎక్కాలు, భాగాహారాలు ఏ విధంగా చే యాలి.సులభంగా విద్యార్థులకు అర్థమయ్యే రీతి లో రూపొందించారు. ఇదే సమయంలో విద్యార్థులకు అందులోనే వర్క్‌బుక్‌లను పొందుపరచటంతో విద్యార్థులు నేర్చుకునేందుకు వెసులుబా టు ఉంటుంది. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులందరికి వీటిని అందజేస్తుండగా నెమ్మదిగా అర్థం చేసుకునే విద్యార్థులకు అర్థమ య్యే రీతిలో చెబుతూ వారిలో సామర్థ్యంను పెంచనున్నారు.



విద్యార్థులు చదువులో రాణించాలి



ఖమ్మంఖానాపురంహవేలి,డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు ఉపయోగించుకోని విద్యార్థులు విద్యలో రాణించాలని ట్రెయినీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ అన్నారు. శనివారం నగరంలోని వేణుగోపాల్ నగర్ ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. ప్రభుత్వ పథకాలు విద్యార్థులకు చేరుతున్నాయో లేదో పరిశీలించారు. విద్యార్థుల ప్రగతిని వ్యక్తిగతంగా పరిశీలించారు. హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	38 రూ.
వంకాయ	20
గుత్తి వంకాయ	38
బీరకాయ	48
పచ్చిమిర్చి	34
కాకరకాయ	28
బెండకాయ	20
పొట్లకాయ	38
దోసకాయ	28-48
చిక్కుడు	48
నాటుచిక్కుడు	80
గోరుచిక్కుడు	28
క్యాబేజీ	24
దొండ	28-36
సొరకాయ	20
క్యారెట్	58
క్యాప్సికం	58
ఆలుగడ్డ	38
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	195
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా

CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	లక్కీభాస్కర్
శ్రీనివాస:	అమరన్
సాయిరాం:	మెకానిక్‌రాకీ
కేపీఎస్:	పుష్ప 2
తిరుమల:	పుష్ప 2
సినీ గెలాక్సీ:	పుష్ప 2

భక్తి శ్రద్ధలతో సుబ్రమణ్య షష్టి



ఖమ్మంసాంస్కృతికం, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): సుబ్రమణ్య షష్టి పర్వదినాన్ని భక్తులు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో తెల్లవారు ఝామునుంచే పూజలు ప్రారంభించారు. భక్తులు సుబ్రమణ్యస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. నాగదోషాల పరిహారం కోసం, కుజ దోషాల నివృత్తి కోసం భక్తులు సుబ్రమణ్య షష్టిని జరుపుకున్నారు. సంతానం లేని దంపతులు సైతం సుబ్రమణ్య షష్టినాడు ప్రత్యేక పూజలు చేశారు.

మధుకాన్ షుగర్స్‌లో క్రషింగ్ షురూ

- ప్రారంభించిన ఫ్యాక్టరీ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కోటయ్య



మధుకాన్‌లో షుగర్స్‌లో క్రషింగ్‌ను ప్రారంభిస్తున్న యార్లగడ్డ కోటయ్య దంపతులు

నేలకొండపల్లి, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మధుకాన్ షుగర్స్‌లో 2024-25సంవత్సరానికి గాను క్రషింగ్‌ను ఫ్యాక్టరీ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కోటయ్య దంపతులు, కేన్‌అసిస్టెంట్ కమిషనర్ రవీందరరావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం కోటయ్య మాట్లాడుతూ చెరుకు రైతుల శ్రేయస్సే లక్ష్యంగా మధుకాన్ షుగర్స్ ఫ్యాక్టరీ యాజమాన్యం పని చేస్తోందన్నారు. 2023-24 క్రషింగ్ సీజన్‌లో 2,31,270 మె.టన్నుల చెరుకును గానుగాడి, 9.90 శాతం రికవరీని సాధించామన్నారు. ఫ్యాక్టరీ నష్టాల్లో ఉన్నప్పటికీ రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఎక్కడా రాజీపడకుండా చెరుకు రైతుకు న్యాయం చేస్తున్నామన్నారు. 2023-24 క్రషింగ్ సీజన్‌లో రైతులకు అనేక పారితోషకాలతో పాటుగా ఎన్నో సబ్సిడీలను అందించామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే అదనంగా రూ.116కలిపి మె.టన్నుకు రూ.3,400 ప్రకటించామన్నారు. ఈధర గత సంవత్సరం కంటే రూ.210ఎక్కువన్నారు. కొత్తగా చెరుకు నాటే రైతులకు ఎకరాకు మూడు టన్నుల విత్తనం లేదా రూ.10,200 విలువైన నర్సరీ మొక్కలను కానీ అందచేస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు సూరపనేని రామకృష్ణ, నెల్లూరి భద్రయ్య, యాసా విష్ణువర్ధన్‌రెడ్డి, తలశీల గోపాలరావు, చింతనిప్పు సైదులు, జూకూరి గోపాలరావు, రచ్చా నర్సింహారావు, బెల్లం పుల్లయ్య, ఆలగడప రాఘవులు, యలమద్ది లెనిన్ బోనగిరి కిరణ్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ప్రథమ చికిత్సా కేంద్రం ప్రారంభం

ఖమ్మంటౌన్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయ (కలెక్టరేట్) ఉద్యోగుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్సకేంద్రాన్ని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ శనివారం ప్రారంభించారు. కలెక్టరేట్‌లో పనిచేస్తున్న వివిధ శాఖల ఉద్యోగులకోసం ఈ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలు వస్తే ఈ ప్రథమ చికిత్సకేంద్ర సేవలను వినియోగించుకోవాలని కోరారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

నేలకొండపల్లి,డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): ఈనెల14న ఖమ్మం జరుగనున్న లోక్ అదాలత్‌ను చిన్న,చిన్న కేసులున్న వారు రాజీ చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని నేలకొండపల్లి ఎస్‌ఐ పెంటరి సంతోష్ కోరారు. ప్రమాదాలు, పేకాట, ఛీటింగ్, భూతగాదాలు, దొంగతనం మొదలైన కేసుల్లో రాజీ చేసుకుని పరిష్కరించుకోవచ్చన్నారు.

ఎక్స్‌ప్రెస్‌లు ఆపాలని రాస్తారోకో



దమ్మాయిగూడెంలో రాస్తారోకో చేస్తున్న ప్రజాపంథా నాయకులు

తిరుమలాయపాలెం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని దమ్మాయిగూడెంలో అన్ని డిపోల ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఆపాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో శనివారం దమ్మాయిగూడెంలో రాస్తారోకో నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఈసందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకులు తిమ్మిడి హనుమంతరావు మాట్లాడుతూ దమ్మాయిగూడెం అన్ని గ్రామాలకు కేంద్రంగా ఉన్నందున ఖమ్మం, సత్తుపల్లి, భద్రాచలం, మధిర, కొత్తగూడెం, వరంగల్, కరీంనగర్, హనుమకొండ డిపోల బస్సులు ఆపాలన్నారు. దమ్మాయిగూడెం మీదుగా బీరోలు, బచ్చోడు, కాకరవాయి, సూర్యపేటమీదుగా హైదరాబాదుకు బస్సులు నడపాలన్నారు ఈనిరసనలో ఎస్.వెంకటేశ్వర్లు, కూసు అప్పారావు, పమ్మి వెంకటేశ్వర్లు, వేముల ఉపేందర్, మట్టే గురుమూర్తి, సీహెచ్‌నాగభూషణం, ఉన్నం నరేష్, ఉన్నం నాగేశ్వరరావు, జగదీష్, యాకుబ్ పాల్గొన్నారు.

సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శిగా గోపాలరావు

మధిరరూరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): సీపీఎం మధిర డివిజన్ 19వ మహాసభలు శనివారం మధిర మండలం మల్లారం గ్రామంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. మహాసభలో ఇటీవల మృతిచెందిన సీతారాం ఏచూరికి ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శిగా మడుపల్లి గోపాలరావును సభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభకు హాజరైన నేతలు మాట్లాడుతూ నియోజకవర్గంలో, గ్రామాల్లో పార్టీకి పూర్వవైభవం తెచ్చేలా కృషిచేయాలని, జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం సత్తా చాటాలని పిలుపునిచ్చారు. మధిర నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన ముఖ్యనేతలు, కార్యకర్తలు, అనుబంధసంఘాల సభ్యులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

'సంక్రాంతికి మద్దులపల్లి మార్కెట్ పూర్తి'



మార్కెట్ పనులు పరిశీలిస్తున్న చైర్మన్ హరినాథబాబు

ఖమ్మంరూరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి నాటికి మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ నిర్మాణం పూర్తవుతుందని మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథబాబు పేర్కొన్నారు. మండల పరిధిలోని మద్దులపల్లిలోని మార్కెట్ పనులను శనివారం చైర్మన్ హరినాదబాబు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జీ తుంబూరి దయాకర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి పొంగులేటి ఆదేశాలతో పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అత్యాధునిక హంగులతో నాణ్యత ప్రమాణాలతో మార్కెట్ అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు. మార్కెట్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు పనులపై పూర్తి దృష్టిసారించినట్లు తెలిపారు. నాణ్యతతో పనులు చేయాలన్నారు. ఈ నిర్మాణం పూర్తి జరిగితే రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు వెంకట్ రెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీహరియాదవ్‌కు ఘన నివాళి





శ్రీహరి యాదవ్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కుటుంబ సభ్యులు, అనాథ పిల్లలకు అన్నవితరణ చేస్తున్న కూతురు,అల్లుడు

ఖమ్మంటౌన్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): యాదవసంఘం నాయకులు చిత్తారు శ్రీహరి యాదవ్ 13వ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన కుటుంబసభ్యులు పలు కార్యక్రమాలు నిర్వహించారు. వైరా మండలం అష్టగుర్తి గ్రామంలో ఆయన విగ్రహానికి భార్య ఇందుమతి, గ్రామ యాదవసంఘ నాయకులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఖమ్మం నగరంలోని అమ్మ స్వచ్ఛంద సేవాసంస్థలో అనాథ పిల్లలకు శ్రీహరి యాదవ్ కూతురు, అల్లుడు వైద్యులు అఖిల, రవిశంకర్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. అనంతరం అన్న వితరణ చేశారు. నగరంలోని యాదవ సంఘం భవన్‌లో విద్యార్థులకు నెలకు సరిపడా నిత్యావసరాలు అందించారు. యాదవ సంఘ భవన నిర్మాణంలో ఆయన ఇచ్చిన సహకారాన్ని పలువురు యాదవసంఘ నేతలు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

పంట వ్యర్థాలను కాల్చొద్దు: ఏడీఏ

చింతకాని, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): పంట వ్యర్థాలను కాల్చకుండా, వాటిని భూమిలో కలియదున్నడం వలన ఎరువుగా మారుతుందని జిల్లా వ్యవసాయాధికారి డి. పుల్లయ్య రైతులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని జగన్నాథపురం, అనంతసాగర్ గ్రామాల్లో రైతుల వ్యవసాయ క్షేత్రాలను ఆయన సందర్శించారు. అనంతసాగర్ గ్రామంలో ఓ రైతు వరి దుబ్బులను కాల్చుతుండటంతో రైతుకు అవగాహన కల్పించా రు. పంట వ్యర్థాలను కాల్చడం ద్వారా భూ మిలో పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయన్నారు. భూమిలో 2 శాతం ఉండాల్సిన కర్బనం ఒక శాతానికి పడిపో తుందని వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో ఎస్ మానస, ఏఈవో రాము పాల్గొన్నారు.

ఎస్‌బీఐటీలో స్వాగత వేడుకలు

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్‌బీఐటి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఈసీఈ, ఈఈఈ విద్యార్థుల స్వాగత వేడుకల ఘనంగా నిర్వహించారు. కంప్యూటర్ విద్యకు దీటుగా ఎలక్ట్రికల్ విద్యకు అవకాశాలు ఉన్నాయని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ,కరస్పాండెంట్ జీ.ధాత్రీ, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

భరతనాట్యంలో సర్వజ్ఞ విద్యార్థిని ప్రతిభ



ఖమ్మం ఖానాపురంహవేలి డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్వజ్ఞ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న ఎం సాయిరిద్ది ఆల్‌ఇండియా భరతనాట్య పోటీలలో ప్రతిభ కనబరిచి మెదటి బహుమతి సాధించింది. ఈవివరాలు పాఠశాల డైరెక్టర్స్ ఆర్వీ నాగేంద్రకుమార్, నీలిమ తెలిపారు. శుక్రవారం నాగపూర్‌లో ఈ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినిని అభినందించారు.

హార్వెస్ట్‌కు ఎన్‌సీసీ-బీ సర్టిఫికెట్



విద్యార్థులతో ఎన్‌సీసీ అధికారులు

ఖమ్మంఖానాపురంహవేలి,డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): నగరంలోని హార్వెస్ట్ జూనియర్ కళాశాలకు ఎన్‌సీసీ-బీ సర్టిఫికెట్ కోర్సుకు అనుమతి లభించిందని విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతి రెడ్డి తెలిపారు. శుక్రవారం నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్ కోర్సులకు ఎంపిక చేశారని తెలిపారు. సెలక్షన్ కమిటీలో ఖమ్మం 11టీజీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సంజయ్ బాద్రా, ఎఓ నవీన్ యాదవ్ పాల్గొన్నారు.

గీతాంజలికి ట్రైల్ బ్లేజర్ అవార్డు

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గీతాంజలి పాఠశాలకు ట్రైల్ బ్లేజర్ అవార్డు అందించారు. శనివారం హైద్రాబాద్‌లో బ్రెయిన్‌ఫీడ్ మాగజైన్ నిర్వహించిన విద్యా సదస్సులో విద్యా సంస్థలకు ఇచ్చే ప్రతిష్టాత్మకమైన ట్రైల్ బ్లేజర్ అవార్డును పాఠశాల డైరెక్టర్లు టీ.పద్మా, అరుణ్‌కుమార్‌లు అందుకున్నారు. అవార్డు అందుకున్న డైరెక్టర్లను పాఠశాల కరస్పాండెంట్ టీవీ అప్పారావు, ఉపాధ్యాయులు అభినందించారు.



అవార్డు అందుకుంటున్న పాఠశాల డైరెక్టర్లు

భట్టికి ఉద్యోగ సంఘాల నాయకుల కృతజ్ఞతలు



భట్టిని కలిసిన ఏలూరి, సైదులు

ఖమ్మంటౌన్,డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన చేపట్టిందని, ఇందుకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి ఉద్యోగసంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని పూలే ప్రజాభవన్‌లో విద్యుత్ బీసీ ఉద్యోగులు, టీజీఈజేఏసీ తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘాలు, తెలంగాణ ఉద్యోగుల జేఏసీ వైస్ చైర్మన్ దేవరకొండ సైదులు ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిశారు. 1931తరువాత వెనుకబడిన కులాల సంబంధించి ఎలాంటి లెక్కలు లేవని, అందువల్ల బీసీలు అనేక రకాలుగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కుల గణన ద్వారా బీసీల జనాభా లెక్కలు తేలబోతున్నాయని స్థానిక సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగ నియామకాలలో రిజర్వేషన్లలో బీసీలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీఈ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జర్నల్ ఏలూరి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ దేవరకొండ సైదులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాముల నిరసన

- మాలధరించిన బాలికను గెంటివేసిన ఆలయ కమిటీ
- శ్రీనివాసనగర్ ఆలయంలో రెండు గంటల ధర్నా
- క్షమాపణలు చెప్పిన కమిటీ

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసనగర్‌లో గల అయ్యప్ప ఆలయ కమిటీ తీరుతో మాలధారులు రెండు గంటలు నిరసన వ్యక్తం చేశారు. శనివారం ఈ ఆలయంలో స్వాములను అమర్యాదగా పిలుస్తూ మాలధరించిన బాలికను దూషిస్తూ గెంటేశారు. కోపోద్రిక్తులైన స్వాములు ఆలయ కమిటీ సభుల ప్రవర్తన సరిగా లేదంటూ ధర్నాకు దిగారు. సుమారు రెండు గంటలకు పైగా ఆలయం ఎదుట రోడ్డుపై బైటాయించారు.ఇరుముడికి ఆలయానికి వచ్చే కుటుంబ సభ్యులను ఆలయంలో కూర్చోకుండా, తెచ్చుకున్న ఆహారాన్ని తినకుండా చేస్తున్నారని వేదన వ్యక్తం చేశారు. ఇరుముడుళ్ళు కట్టుకున్న స్వాములు రైలు సమయం రాత్రిపూట ఉండటంతో మధ్యాహ్నం వరకు ఆలయంలో ఉంటే వారిని కూర్చోకుండా అసభ్యంగా మాట్లాడటం మానుకోవాలని హెచ్చరించారు. చిన్న స్వాములను గెంటివేయటంతో వారికి ఆలయ రేయిలింగ్ తగిలి స్వల్ప గాయాలు అయ్యాయని చెప్పారు. అయ్యప్ప మాలధారణకు, ఇరుముడులకు నగదు చెల్లించినా స్వాముల పట్ల అమర్యాదగా మాట్లాడటం పద్ధతికాదని, క్షమాపణలు చెప్పాని డిమాండ్ చేశారు. ఆలయ గదులను ఫంక్షన్‌హాల్ చేసి అద్దెలకు ఇస్తుండటంతో భక్తులకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. విషయం తెలుకున్న త్రీటౌన్ సీఐ రమేష్ సంఘటనా స్థలానికి చేరుకోని ఆలయ కమిటీ సభ్యులతో, అయ్యప్ప స్వాములతో మాట్లాడారు. స్వాములకు ఆలయ కమిటీ సభ్యులు క్షమాపణలు చెప్పటంతో అయ్యప్ప స్వాములు శాంతించారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.





స్వాములతో మాట్లాడుతున్న త్రీటౌన్ సీఐ రమేశ్, రోడ్డుపై ధర్నా నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు

సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం

తిరుమలాయపాలెం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని జల్లేపల్లి, బీరోలు, తిరుమలాయపాలెం, కాకరవాయి ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో వివిధ గ్రామాల వారికి సీఎంకప్ క్రీడాపోటీలు నిర్వహించారు. క్రీడాకారులు ఉత్సాహంగా వివిధ క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ పీవీ రామకృష్ణ, ఎంపీడీవో సిలార్‌సాహెబ్,, ఎస్ఐ కూచుపుడి జగదీష్, ఎంపీవో సూర్యనారాయణ పాల్గొన్నారు.

సీఎంకప్ లోగో ఆకృతిలో విద్యార్థులు

కొణిజర్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సీఎం కప్ క్రీడా పోటీలలో భాగంగా జిల్లా వ్యాప్తంగా గ్రామస్థాయిలో క్రీడా పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమైనాయి. ఈ సందర్భంగా మండల పరిధిలోని తనికెళ్ళ గ్రామంలో విద్యార్థులు వినూత్నంగా సీఎం కప్ లోగో ఆకృతిని ప్రదర్శించి అబ్బురపరిచారు. అంతకు ముందు డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని గ్రామస్థాయి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీఈటీ శ్రీనివాస్ ఉన్నారు.



కొణిజర్లలో సీఎం కప్ లోగో ఆకృతిలో విద్యార్థుల ప్రదర్శన

ఆంధ్రజ్యోతి
ZONE
ఆదివారం 8 డిసెంబరు 2024
● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి
వైరా-మధిర
సత్తుపల్లి
WYRA, MADHIRA, SATHUPALLY



ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై సమీక్ష

కల్లూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సాంబ శివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్‌లు ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ఆదివారం నుంచి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే జరగనున్నదని ఎంపీడీవో తెలిపారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. సర్వేకు వచ్చిన అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఐకేపీ ఏపీఎం వెంకటరామారావు, పంచాయతీ కార్యదర్శులు, సీసీలు పాల్గొన్నారు.

పంట వ్యర్థాలను కాల్చొద్దు

» డీఏవో డి. పుల్లయ్య

చింతకాని, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పంట వ్యర్థాలను కాల్చకుండా, వాటిని భూమిలో కలియదున్నడం వలన ఎరువుగా మారుతుందని జిల్లా వ్యవసాయాధికారి డి. పుల్లయ్య రైతులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని జగన్నాథపురం, అనంత సాగర్ గ్రామాల్లో రైతుల వ్యవసాయ క్షేత్రాలను ఆయన సందర్శించారు. అనంతసాగర్ గ్రామంలో ఓ రైతు వరి దుబ్బులను కాల్చుతుండటంతో రైతుకు అవగాహన కల్పించారు. పంట వ్యర్థాలను కాల్చడం ద్వారా భూమిలో పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయన్నారు. భూమిలో 2 శాతం ఉండాల్సిన కర్బనం ఒక శాతానికి పడిపోతుందని వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో ఎస్ మానస, ఏఈవో రాము పాల్గొన్నారు.



రైతుతో మాట్లాడుతున్న డీఏవో పుల్లయ్య

ఎండపల్లి గుట్టలో
మట్టిదందా

» అభివృద్ధి ముసుగులో తరలిపోతున్న మట్టి » చోద్యం చూస్తున్న అధికారులు



ఎండపల్లి గుట్టలో మట్టి తవ్వకాలు చేస్తున్న ఎక్స్‌వేటర్ దృశ్యం

మధిర రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అధికారం అండతో అభివృద్ధి ముసుగులో యథేచ్ఛగా అక్రమార్కులు మట్టిని తరలిస్తున్నారు. గత కొన్నిరోజులుగా ఎండపల్లి గుట్ట నుంచి అక్రమంగా మట్టి తరలిపోతున్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యారు. మధిరతోపాటు ఆంధ్రాలోని చుట్టూపక్కల పలు మండలాలకు ఈ మట్టిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా మట్టిని టిప్పర్లలో బయటకు పంపించేస్తున్నారు.

మధిర మండలం ఎండపల్లి గుట్ట వద్దనుంచి నేషనల్ హైవే రహదారికి మట్టిని తోలుకొనేందుకు అనుమతులు తీసుకున్నారు. అలాగే మధిర ప్రాంతంలో పలు ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో భాగంగా రోడ్ల నిర్మాణానికి ఇక్కడి నుంచి మట్టిని తరలిస్తున్నారు. అయితే ఇంతవరకు బాగానే ఉన్నా... అభివృద్ధి ముసుగులోనే మరికొంత మట్టి ఇక్కడి నుంచి టిప్పర్ల ద్వారా భారీగా బయటకు వెళ్తుంది. పైకి చూడటానికి ఈ గుట్ట నుంచి అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా రోడ్ల నిర్మాణానికి మట్టి తోలుతున్నట్లు కన్పిస్తున్నప్పటికీ, రెండో కోణంలో అక్రమార్కులు ఇదే అదునుగా మరికొన్ని చోట్లకు మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికార పార్టీకి చెందిన ఇద్దరు వ్యక్తులు మట్టిని తరలించి సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎండపల్లి గుట్ట ప్రాంతం ఆంధ్రా-తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులో ఉంటుంది. ఇక్కడి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోనే ఆంధ్రా ప్రాంత గ్రామాలున్నాయి. ఈ మట్టిని ఆంధ్రాలోని పలు ప్రాంతాలకు తరలించి అక్కడ అ మ్ముతున్నారు. అలాగే మధిర పట్టణంలో కూడా విక్రయిస్తున్నారు. టిప్పర్‌కు రూ.8వేల చొప్పున మట్టిని అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక రైతులు కొంతమంది ఇదేమిటని ప్రశ్నిస్తే రోడ్ల నిర్మాణాలకు మట్టిని తరలిస్తున్నామని సమాధానమిస్తున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండపల్లి గుట్ట ఉత్తరభాగం వైపు భారీ ఎత్తున గతంలో ఎన్నడూలేనివిధంగా మట్టి తవ్వకాలు జరిగాయి.

హద్దులు దాటి తవ్వకాలు...

ఎండపల్లి గుట్టలో హద్దులు దాటి ఇతర ప్రాంతాల్లోనూ విచ్చలవిడిగా తవ్వకాలు చేపడుతున్నారు. సామాన్యుడు ట్రక్కు మట్టిని సొంతింటి అవసరాలకు తోలుకుంటేనే నానా ఇబ్బందులు పెట్టే అధికారులు కనీసం మట్టి తవ్వకాలపై సరైన పర్యవేక్షణ చేయకపోవడంతో పెద్ద ఎత్తున అక్రమంగా మట్టి తరలివెళ్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లోనైతే పెద్ద సంఖ్యలో టిప్పర్లలో ఆంధ్రా ప్రాంతానికి చెందిన గంపలగూడెం, తిరువూరు మండలాలకు మట్టి తరలివెళ్తుందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి అభివృద్ధి ముసుగులో మట్టిని తరలిస్తున్న అక్రమార్కులను కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటాం

• మైనింగ్ ఏడీ సాయినాథ్

అక్రమంగా మట్టి తరలిస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామని మైనింగ్ ఏడీ సాయినాథ్ అన్నారు. ఎండపల్లి గుట్ట నుంచి నేషనల్ హైవే రోడ్డు నిర్మాణానికి మట్టిని తోలుకొనేందుకు అనుమతులు తీసుకున్నారని తెలిపారు.

ఒకవేళ అభివృద్ధి కార్యక్రమాలకు కాకుండా ప్రైవేట్‌గా మట్టి ని తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫ్రీజర్ బాక్స్ వితరణ

పెనుబల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి మండలం గంగదేవిపాడు గ్రామానికి చెందిన ఈడుపుగంటి శ్రీరాములు ఫ్రీజర్ బాక్సును గ్రామపంచాయతీ కార్యదర్శి రామకృష్ణకు శనివారం అందజేశారు. ఇటీవల తన భార్య సామ్రాజ్యం అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె జ్ఞాపకార్థం ఫ్రీజర్ బాక్సును పంచాయతీకి అందించినట్లు శ్రీరాములు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కనగాల సురేష్‌బాబు, మాజీ ఉపసర్పంచ్ తీగల వెం కటేశ్వర్లు, బాణోతు పంతులు, బాణోతు ఆదిరామ్, బాణోతు భూమేశ్వరరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నిజాయితీతో మెలగాలి



మాట్లాడుతున్న బాలచంద్ర

సత్తుపల్లిరూరల్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశనుంచే నీతినిజాయితీతో, ఎంచుకున్న లక్ష్యాలను సాధించుకుంటూ ఎదగాలని అభయ ఫౌండేషన్ మోటివేషనల్ స్పీకర్ సీఎస్.బాలచంద్ర కోరారు. మండలంలోని కొత్తూరులోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం విస్తృత ఆలోచనా విధానంపై నిర్వహించిన సెమినార్‌లో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ, డీన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎంవీ.రామచంద్రరావు, తదితరులున్నారు.

బోధకాలు నిర్ధారణ పరీక్షలు

మధిర రూరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మడుపల్లి గ్రామంలో దెందుకూరు పీహెచ్‌సీ వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో శనివారం బోధకాలు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది గుర్రం శ్రీనివాస్, నాగేశ్వరరావు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.వెయ్యికోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు

» ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యంలో కేవలం ఏడాది కాలంలోనే వైరా నియోజకవర్గంలో రూ.వెయ్యికోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా శనివారం వైరా మండలంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్‌తో కలిసి వారు ప్రారంభించారు. పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించారు. వైరా, ముసలిమడుగు మహాత్మా జ్యోతిరావ్‌పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైరా నియోజకవర్గంలో రూ.వెయ్యి కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు. 25లక్షలమంది రైతు కుటుంబాలకు రూ.21వేల కోట్ల మేర రూ.రెండులక్షల రుణమాఫీ చేశామని తెలిపారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైస్‌చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, మాజీ ఏఎంసీ చైర్మన్లు బీడీకే.రత్నం, పసుపులేటి మోహన్‌రావు, మాజీ జడ్పీటీసీ నంబూరి కనకదుర్గ, పీఆర్ డీఈ వెంకటేశ్వర్లు, వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, ఏవో మయాన్ మంజూఖాన్, మునిసిపల్ కమిషనర్ చింతా వేణు, ఐబీ డీఈ వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

» ఎమ్మెల్యే మట్టా రాగమయి



పల్లెదవాఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

పెనుబల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లకు శంకుస్థాపనలు, పెనుబల్లిలో పల్లెదవాఖాకు ప్రారంభోత్సవం చేశారు. రామచంద్రరావుబంజర్, వీఎంబంజర్, పెనుబల్లి, ఎడ్లబంజర్, కుప్పెనకుంట్ల, చింతగూడెం, గణేశులపాడు, లంకాసాగర్ గ్రామాల్లో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. పెనుబల్లిలో రూ.25లక్షలతో నిర్మించిన పల్లెదవాఖానా భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో అన్నపూర్ణ, తహసీల్దార్ గంటా ప్రతాప్, ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'సలహాలతో ఒత్తిడి నుంచి బయటపడాలి'



విద్యార్థులతో మాట్లాడుతున్న వైద్యులు

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): టోల్ ఫ్రీ నంబర్ 14416 ద్వారా వైద్యులు అందించే సలహాలతో విద్యార్థులు ఒత్తిడి నుంచి బయటపడవచ్చునని గంగారం పీహెచ్‌సీ వైద్యాధికారి అవినాష్, ప్రసన్నలు అన్నారు. టెలి-మనస్ అనే కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, అధ్యాపకులు లలితమ్మ, ప్రమీల, వనజారాణి, కల్పన, సత్యనారాయణ, కృష్ణవేణి, వెంకటేశ్వరరావు, జబీనా, సంధ్యారాణి, ప్రియాంక, అజయ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని నిరసన

ముదిగొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణం పూర్తిగా చేపట్టకపోవడంతో దుమ్ము, ధూళితో అనారోగ్యంపాలవుతున్నామని శనివారం ముదిగొండ-వల్లభి రహదారిపై సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ముదిగొండ నుంచి వల్లభి వరకు నిర్మిస్తున్న ఆర్‌అండ్‌బీ రోడ్డుపై కంకర పోసి నెలలు గడుస్తున్నా తారు వేయకపోవడంతో లారీలు, బస్సులు తిరుగుతున్న సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, నాయకులు మంకెన దామోదర్, మందరపు వెంకన్న, పద్మ, ఇరుకు నాగేశ్వరరావు, బట్టు రాజు, సతీష్, దస్తగిరి, భద్రయ్య పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ హామీని నిలబెట్టుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

తల్లాడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకనుగుణంగా అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక అంబేద్కర్‌భవన్‌లో నాగేశ్వరరావు మాదిగ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఎన్నో దశాబ్దాల సుదీర్ఘపోరాట లక్ష్యం ఎస్సీ వర్గీకరణ అని పేర్కొన్నారు. సమావేశంలో తూరుగంటి అంజయ్యమాదిగ, దారెల్లి వెంకటేశ్వర్లు, నాగరాజు, సురేష్, సురేందర్, బలరాం, రవి తదితరులు పాల్గొన్నారు.

రైతులపై దాడి చేయడం అన్యాయం

» తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరా, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పంటలకు చట్టబద్ధమైన గిట్టుబాటు ధరలు డిమాండ్ చేస్తూ ఢిల్లీ వైపు శాంతియుతంగా వస్తున్న రైతులపై చెంబూ సరిహద్దు వద్ద టీయర్ గ్యాస్, రబ్బర్ బులెట్లతో పోలీసుల దాడి దుర్మార్గపు చర్య అని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ఖండించారు. వైరాలోని బోడేపూడి భవన్‌లో శనివారం జరిగిన రైతుసంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.రెండులక్షల రుణమాఫీ, రైతుభరోసా సకాలంలో రైతులకు అందించకుండా మోసం చేయడం క్షమించరాని విషయమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లెంపాటి రామారావు, చింతనిప్పు చలపతిరావు, సంక్రాంతి నర్సయ్య, వడ్లమూడి మధు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



మధిరటౌన్: సుబ్రహ్మణ్య స్వామి వారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

మధిరటౌన్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మధిర బంజారాకాలనీలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా శనివారం స్వామి వారు అమ్మ వార్ల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కోనేరు రామారావు కుటుంబ సభ్యులతో పాటు కల్యాణానికి బంగారు మంగళసూత్రాలను వితరణ చేసిన వారిని దేవాలయ కమిటీ వారు ఘనంగా సత్కరించారు, అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ నిర్వహణ కమిటీ అధ్యక్షురాలు గుర్రం ప్రమీల, మల్లాది వాసు, కోనేరు లీలాశంకర్, ముత్తయ్య, కళ్యాణపు పుల్లారావు, వీరారెడ్డి, కటకం నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.



తల్లాడలో కావిడి సేవ చేస్తున్న భక్తులు

మధిర రూరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మధిర మండలం దెందుకూరు గ్రామంలో నాగేంద్రస్వామి పుట్టవద్దగల సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ వేడుకలను శనివారం అంగరంగవైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తల్లాడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తల్లాడలో శనివారం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పంచమ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. స్థానిక భద్రాచలం రోడ్డులోని శ్రీమహాగణపతి సుబ్రహ్మణ్యస్వామి, వాయులింగేశ్వర, కాలభైరవ మందిరం పంచమ వార్షికోత్సవం సందర్భంగా గణపతి పూజ, పంచామృతాభిషేకం, కావిడి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్త యాసా నాగేంద్రప్రసాద్, నంబూరి మోహన్‌రావు, దారా శ్రీనివాసరావు, దగ్గుల నారాయణరెడ్డి, శీలం వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా విజయోత్సవ కళాయాత్ర



కొణిజర్లలో పాటల ద్వారా ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న కళాకారులు

కొణిజర్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా శనివారం మండల పరిధిలోని కొణిజర్ల, తనికెళ్ల, పెద్దమునగాల పలు గ్రామాలలో తెలంగాణ సాంస్కృతిక కళాకారుల ఆధ్వర్యంలో విజయోత్సవ కళాయాత్ర కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాకారులు కల్వకట్ల జాన్, నలగాటి సుధాకర్, పరకాల అజయ్, మాచర్ల కృష్ణ, బంక భద్రయ్య, పిడియాల లక్ష్మయ్య, కొండ్రు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వైరా, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంజిల్లాలోని తెలంగాణ సాంస్కృతిక సారథి ప్రభుత్వ కళాకారులు శనివారం వైరా మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ పథకాలపై కళారూపాలను ప్రదర్శించారు. కళాకారులు ప్రదర్శించిన కళారుపాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో టీం లీడర్ కోటేశ్వరరావు, సభ్యులు రమణ, రమేష్, ముత్తయ్య, రవి, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శిగా గోపాలరావు



మధిర రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీపీఎం పార్టీ మధిర డివిజన్ 19వ మహాసభలు శనివారం మధిర మండలం మల్లారం గ్రామంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. మహాసభలో ఇటీవల మృతిచెందిన సీతారాం ఏచూరికి ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శిగా మడుపల్లి గోపాలరావును సభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభకు హాజరైన నేతలు మాట్లాడుతూ నియోజకవర్గంలో, గ్రామాల్లో పార్టీకి పూర్వవైభవం తెచ్చేలా కృషిచేయాలని, జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం సత్తా చాటాలని పిలుపునిచ్చారు. మధిర నియోజకవర్గంలోని ఐదుమండలాలకు చెందిన ముఖ్యనేతలు, కార్యకర్తలు, అనుబంధసంఘాల సభ్యులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

శ్రీహరియాదవ్ ఆశయాలు సాధించాలి



శ్రీహరియాదవ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వైరా, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చిత్తారు హరియాదవ్ చిరస్మరణీయుడని, అతని ఆశయాలు సాధించాలని భారత యాదవ మహాసభ జిల్లా గౌరవాధ్యక్షుడు మేకల మల్లిబాబుయాదవ్, జిల్లా అధ్యక్షుడు చిలకల వెంకటనర్సయ్య పేర్కొన్నారు. మండలంలోని అష్ణగుర్తి గ్రామంలో చిత్తారు శ్రీహరియాదవ్ 13వ వర్ధంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. శ్రీహరియాదవ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఖమ్మంజిల్లా యాదవ యువజన అధ్యక్షుడు చిత్తారు సింహాద్రి యాదవ్, తెల్లబోయిన రమణ, బమ్మిడి శ్రీనివాస్, లింగరాజు యాదవ్, రాచబంటి వంశీ, చిత్తారు నాగరాజు, పుల్లయ్య, కృష్ణయ్య, నాగేశ్వరరావు, గోవిందు, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా సీఎం కప్ టోర్నమెంట్ పోటీలు



కొణిజర్లలో సీఎం కప్ లోగో ఆకృతిలో విద్యార్థుల ప్రదర్శన

సత్తుపల్లి, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీలు పట్టణంతో పాటు మండలంలోని గ్రామ పంచాయితీలలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని కిష్టారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో క్లస్టర్‌లోని వివిధ గ్రామాల నుంచి క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం సయ్యద్ సమ్మద్, సెక్రటరీ రమణకుమార్, వ్యాయామ ఉపాధ్యాయురాలు కనకమ్మ, ఉపాధ్యాయులు రియాజుద్దీన్, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, నాగరాజు, జీవీఆర్, మోహన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామ పంచాయతీల వారీగా ప్రభుత్వ పాఠశాలల్లో సీఎం కప్ క్రీడా పోటీలను మండలంలోని అన్ని గ్రామాలలో నిర్వహించారు.

సీఎంకప్ లోగో ఆకృతిలో విద్యార్థులు

కొణిజర్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సీఎం కప్ క్రీడా పోటీలలో భాగంగా జిల్లా వ్యాప్తంగా గ్రామస్థాయిలో క్రీడా పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమైనాయి. ఈ సందర్భంగా మండల పరిధిలోని తనికెళ్ల గ్రామంలో విద్యార్థులు వినూత్నంగా సీఎం కప్ లోగో ఆకృతిని ప్రదర్శించి అబ్బురపరిచారు. అంతకు ముందు డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని గ్రామస్థాయి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీఈటీ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



కల్లూరులో పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

కల్లూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని మినీ స్టేడియంలో శనివారం సీఎం కప్ క్రీడల పోటీలను ప్రారంభించారు. కల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బాగం నీరజాదేవి, మండల తహసీల్దార్ సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్‌లు ప్రారంభించారు. స్థానిక గ్రామ పంచాయితీ పరిధిలో ముందుగా వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నివేదిత, పంచాయతీ ఈవో నాగేశ్వరరావు, టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శులు బానోతు భీమా, వీరరాఘవయ్య, పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సత్తుపల్లిలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఉపాధ్యాయులు